RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 59 ISSUE NO : 59 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, ఆగస్టు, 19, 2025 Tuesday, August, 19, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-




## ఓబుళాపురం మైనింగ్ కేసు
## మరోమారు సబితకు
# హైకోర్టు నోటీసులు

హైదరాబాద్,తెలంగాణ దిశ

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ కృపానందానికి తెలంగాణ హైకోర్టు నోటీ-సులు జారీ చేసింది. ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో వీరిద్దరిని నిర్దోషులుగా తేల్చుతూ నాంపల్లి సీబీఐ కోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. ఈక్రమంలో కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత న్యాయస్థానం సబితా ఇంద్రారెడ్డి, కృపానందాన్ని ఆదేశించింది. విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు మే నెలలో తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు- సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదు గురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్దన్ రెడ్డి, బీవీ శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ వీడీ రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు-జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ.10 వేలు చొప్పన జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది.

- అమెరికా చేరుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ
- అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యూరప్ అగ్రనేతలతో కీలక సమావేశం
- రష్యాపై ఒత్తిడి పెంచి, శాశ్వత శాంతి సాధించడమే లక్ష్యమని వెల్లడి
- గతంలోలా భూభాగాలను వదులుకోబోమని జెలెన్‌స్కీ స్పష్టీకరణ
- ట్రంప్ వైఖరిపై, శాంతి ఒప్పందంపై యూరోపియన్ దేశాల ఆందోళన



# యుద్ధం ముగించాల్సిందే..

## ట్రంప్‌తో భేటీకి ముందు రష్యాకు జెలెన్‌స్కీ స్పష్టమైన

# సందేశం

ఢిల్లీ,: ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించే దిశగా జరుగుతున్న దౌత్యపరమైన ప్రయత్నాలు కీలక దశకు చేరుకున్నాయి. రష్యాపై ఉమ్మడిగా ఒత్తిడి పెంచి, శాశ్వత శాంతిని సాధించే లక్ష్యంతో ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ సోమవారం వాషింగ్టన్‌లో అడుగుపెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాటు పలు యూరోపియన్ అగ్రనేతలతో ఆయన జరపనున్న ఉన్నత స్థాయి సమావేశంపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ పర్యటన గురించి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో జెలెన్‌స్కీ స్వయంగా వెల్లడించారు. "నేను ఇప్పటికే వాషింగ్టన్ చేరుకున్నాను. రేపు ట్రంప్‌తో, యూరోపియన్ నేతలతో సమావేశమవుతాను. ఈ యుద్ధాన్ని వేగంగా, నమ్మకంగా ముగించాలనే బలమైన కోరిక మా అందరిలో ఉంది.



## రష్యా నుంచి ముడి చమురు
# కొనుగోలు

**భారత్‌కు అమెరికా తీవ్ర హెచ్చరిక**

- భారత్ చర్య ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూర్చినట్టేనని ఆరోపణ

వాషింగ్టన్: రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు చేస్తున్న విషయంలో భారత్‌పై అమెరికా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ చర్యలను తక్షణమే నిలిపివేయాలని, లేనిపక్షంలో అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్య హోదాపై ప్రభావం పడుతుందని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో హెచ్చరించారు. అయితే, ఈ ఆరోపణలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. తమను అన్యాయంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని, అమెరికా సహా ఐరోపా దేశాలు కూడా రష్యాతో ఇప్పటికీ వాణిజ్యం చేస్తున్నాయని గుర్తు చేసింది. 'ఫైనాన్షియల్ టైమ్స్' పత్రికలో రాసిన ఒక వ్యాసంలో పీటర్ నవారో ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి భారత్ చమురు కొనడం వల్ల, పరోక్షంగా ఉక్రెయిన్‌పై మాస్కో చేస్తున్న యుద్ధానికి నిధులు సమకూరుస్తున్నట్టే అవుతుందని ఆయన ఆరోపించారు.





## మత ప్రాతిపదికన రిజర్వేషన్లు
# ఇవ్వడం లేదు

- బిసి రిజర్వేషన్లు అడ్డుకునేందుకు ఇదో సాకు
- రాహుల్‌తో రాజకీయ వైరం ఉంటే తేల్చుకోండి
- బిసి రిజర్వేషన్లు మాత్రం అడ్డుకోవడం సరికాదు
- సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,తెలంగాణ దిశ

బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవడమే లక్ష్యంగా ముస్లిం పేరుతో వాదనలు సృష్టిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మైనార్టీల రిజర్వేషన్లు ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, గుజరాత్ ఎలా అమలులో ఉన్నాయో కేంద్రం పరిశీలించాలని, అక్కడ తొలగించే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీపై కోపం ఉంటే రాజకీయంగా ఎదుర్కోవచ్చని, కేసులు పెట్టవచ్చని.. కానీ, ఆయన నమ్మిన బీసీ సాధికారత సిద్ధాంతాన్ని దెబ్బతీయొద్దని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. విద్య, ఉద్యోగం, రాజకీయాల్లో బీసీలు ముందుకు రావడం రాహుల్ గాంధీ లక్ష్యమని, ఆ సూచనలను అమలు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం తెలంగాణ సమాజానికి ఆదర్శంగా నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ట్యాంక్‌బండ్ సమీపంలో పాపన్నగౌడ్ విగ్రహానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లా డారు. బహుజనుల సామ్రాజ్యాన్ని అందరికీ ఎలా అందించవచ్చో పాపన్నగౌడ్ నిరూపించారన్నారు. పాపన్నగౌడ్ కోటను గత ప్రభుత్వాలు మైనింగ్ లీజుకు ఇచ్చాయని విమర్శించారు.



## సిఇసిపై అభిశంసనకు
# కాంగ్రెస్ సమాయత్తం

**కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ ప్రకటన**

న్యూఢిల్లీ,: ఓట్ల చోరీ జరిగిందని ఆరోపిస్తూ ఎన్నికల సంఘం లక్ష్యంగా విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తోన్న నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌పై అభిశంసనకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దానికి సంబంధించి నోటీసును తీసుకువచ్చేందుకు ప్రతిపక్ష సభ్యులు యోచన చేస్తున్నారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆ వ్యవహారంపై తాము త్వరలో నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ మీడియాకు వెల్లడించారు.



# మాటల యుద్ధం..

## కేటీఆర్ వర్సెస్ రేవంత్

హైదరాబాద్,తెలంగాణ దిశ

తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రతిపక్ష బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉప్పు నిప్పులా ఉంటున్నారు. ప్రతీ విష యానికి ఒకరిపై ఒకరు వ్యక్తి గత దూషణలకు దిగుతున్నారు. ప్రభు త్వ వైఫల్యాలకు బాధ్యుడిని చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీార్ విచు చుకుపడుతున్నాడు. ఇక రేవంత్‌రెడ్డి కూడా వీలు దొరికినప్పుడల్లా కేటీఆ ర్‌పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. తెలంగాణలో వీరి మాటల యుద్ధం కామన్ అయింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ పేరు ఎత్తకుండా తిట్లదాడి చేశారు. 'నేను పెద్ద పెద్ద ఇంగ్లీష్ చదువులు చదువుకోకపోయినా నాకు కామన్ సెన్స్ ఉంది.

## యూరియా కొరతపై కాంగ్రెస్ వాయిదా
# తీర్మానం

**కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి**

న్యూఢిల్లీ, : దేశవ్యాప్తంగా మరోమారు యూరియా కొరతల ఆందోళన కనిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. రైతుల క్యూలో నిలబడి యూరియా కోసం పడిగాపులు కాస్తున్నారు. అయితే రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా యూరియా కొరత తీవ్ర దుమారం రేపుతుంది. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు వివక్షత చూపిస్తూ.. యూరియా ఇవ్వడం లేదని అధికార పార్టీ నేతలు ఆరోపిస్తుంటే.. అధికారంలో ఉన్న నేతలు యూరియాను బ్లాక్‌లో అమ్ముకున్నారని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నాయి. ఏది ఎలా పోయినా.. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నది వాస్తవం. అది రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యమో, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమో తెలియక రైతులు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.





## విద్యుత్ ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ
# చేపడతాం
## మంత్రి శ్రీధర్ బాబు

సికింద్రాబాద్,తెలంగాణ దిశ

రామంతపూర్ కృష్ణాష్టమి వేడుకల్లో జరిగిన విద్యుత్ ప్రమాద ఘటనలో మృతి చెందిన ఐదుగురి డెడ్ బాడీలకు గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు గాంధీ ఆసుపత్రికి చేరుకొని బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సంవత్సరం జరుపుకునే వేడుకల్లో ప్రమాదం జరగడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

# అధికారులు సమన్వయంతో వినాయక చవితి ఏర్పాట్లు పూర్తి చేయాలి

## - మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి

**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :**వినాయక చవితి సందర్భంగా ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిహెచ్ఎంసి జోనల్ కమీషనర్లు హేమంత్ కుమార్ పాటిల్, అపూర్వ చౌహాన్, అడిషనల్ డిసిపిలు మేడ్చల్ పురుషోత్తం, బాలానగర్ సుదర్శన్, స్పెషల్ బ్రాంచ్ రెహమాన్, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 17 చెరువులలో వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవటంతో పాటు నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సైతం సిద్ధం చేసుకొని అందుకు అవసరమైన రూట్లలో రోడ్డు మరమ్మతు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణా శాఖ అధికారులు సర్టిఫై చేయాలని ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టుదిట్టమైన భద్రత ఉండేలా ఏర్పాట్లు చూడాలని కలెక్టర్



తెలిపారు. నిమజ్జన ప్రదేశాలలో గతంలో కంటే అధిక సంఖ్యలో గజ ఈతగాళ్ళను అందుబాటులో ఉంచాలని జిల్లా మత్స్య శాఖ అధికారికి అదనపు కలెక్టర్ సూచించారు. గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకొని తాగునీరు, విద్యుత్తు, పారిశుద్ధ్యం, మెడికల్, లైటింగ్ వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలని తెలిపారు. గణేష్ నవరాత్రులు ముగించి నిమజ్జనం చేసే సందర్భంలో అగ్ని మాపక శాఖ సిబ్బంది అప్రమత్తంగా అందుబాటులో ఉండాలని కలెక్టరు స్పష్టం చేశారు. వినాయక నిమజ్జన స్థలాల వద్ద భారీ క్రేన్లు ఏర్పాటు చేయాలని నిమజ్జనానికి నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా విద్యుత్తు శాఖ అధికారులు ఇప్పటి నుంచే అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని ప్రతి నిమజ్జన స్థలం వద్ద అదనపు ట్రాన్స్ఫార్మర్లు, పవర్ జేనరేటర్లను ముందు జాగ్రత్తగా అందుబాటులో ఉంచడంతో పాటు వినాయక నిమజ్జన సమయంలో విద్యుత్ తీగల సమస్య ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకొవాలని, ముఖ్యంగా భారీ విగ్రహాల రాకపోకలలో కరెంట్ వైర్లు తగలకుండా అవసరమైన



చర్యలను తీసుకోవాలని కలెక్టర్ విద్యుత్తు శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో పాటు నిమజ్జనం చేసే ప్రదేశాలలో అవసరం మేరకు వైద్య శిబిరాలను, ఫస్ట్ ఎయిడ్ కిట్లతో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా జిల్లా వైద్యాధికారి చర్యలు తీసుకోవాలనికలెక్టర్ సూచించారు. అలాగే జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో శానిటేషన్కు సంబంధించి చూడాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జన ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు తీసుకోవాలని, తప్పకుండా వారి వారి పరిధిలోని చెరువులను క్షేత్రస్థాయి తనిఖీ చేయాలని, చెరువులలోని వ్యర్థాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో పాటు ట్రాఫిక్కు అంతరాయంకలగకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పోలీసులు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సమావేశంలో తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, తహశీల్దార్లు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**చర్లపల్లి, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :**తెలంగాణ ప్రజలపై అరాచక పాలన సాగించిన మొఘలులను గద్దెదించి పేద బడుగు బలహీన వర్గాల గుండెల్లో ధైర్యాన్ని నింపిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను సోమవారం చక్రిపురం చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. భారతీయ జనతా పార్టీ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎం. లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్, ఉప్పల్ నియోజకవర్గం సీనియర్ నాయకులు డి. నాదం తాళ్ల ఆనంద్ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఇస్లావత్ హరినాయక్, సీనియర్ నాయకులు పుట్టా సహదేవ్ గౌడ్, కె. విద్యాసాగర్, డివిజన్ ఉపాధ్యక్షులు మచ్చ లక్ష్మీనారాయణ గౌడ్, బొల్లా శ్రీనివాస్ ముదిరాజ్, సోమసాని అశోక్, బీజేవైఎం నాయకుడు అప్పి నాయి, కార్యదర్శి రత్నపురం వెంకటేష్, చక్రిపురం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పాండు ముదిరాజ్, చక్రిపురం గౌడ సంఘం నాయకులు యాదగిరి గౌడ్, రామచంద్ర గౌడ్, నరసింహ గౌడ్, ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దుచేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి: పిఆర్ టియు టిఎస్





**మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :**కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరుతూ సిపిఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1వ తేదీన ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద పిఆర్ టియు టిఎస్ మహా ధర్నా గోడ పత్రికను మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట టీజీఈజెఎసి చైర్మన్ రవి ప్రకాష్ ఆవిష్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి వినోద్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డిలతో కలసి మాట్లాడుతూ గత ప్రభుత్వం దశాబ్ద కాలంగా పాలించి సిపిఎస్ రద్దు చేయలేక ఉద్యోగులను మోసం చేసిందని ధ్వజమెత్తారు. నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సిపిఎస్ ను రద్దు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానం 2004 సెప్టెంబర్ ఒకటవ తేదీ నుండి అమల్లోకి వచ్చిందని, దానిని విద్రోహ దినంగా పాటిస్తూ దశాబ్ద కాలంగా ఉద్యమాలు చేస్తున్నామని అన్నారు. వచ్చే సెప్టెంబర్ ఒకటవ తేదీన ఇందిరా పార్కు వద్ద పిఆర్ టియు టీఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని వారు అన్నారు. ఉపాధ్యాయు లందరూ పెద్ద సంఖ్యలో నల్ల దుస్తులతో పాల్గొని నిరసన తెలియ జేయాలని పిలుపు నిచ్చారు. 30 ఏళ్లుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ పొందితే షేర్ మార్కెట్ల పై ఆధారపడిన అసంబద్ధమైన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఐదు సంవత్సరాలు ప్రజాప్రతినిధిగా కొనసాగితే పెన్షన్ హక్కు ఉన్నప్పుడు, 30 ఏళ్లు ప్రభుత్వానికి ప్రజలకు సేవ చేస్తే పెన్షన్ హక్కు లేకపోవడం విచారకరమన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఏకీకృత పెన్షన్ సిస్టమ్ అని యుపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, రెండు కూడా లోపభూయిష్టంగా ఉన్నాయని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరు ఒకటవ తేదీ రోజు సెలవు పెట్టి మహాధర్నాలో నల్ల దుస్తులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు మరియు రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా కమిటీకి అభినందనల వెల్లువ





**కుత్బుల్లాపూర్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :**మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిన మేడ్చల్ జిల్లా కమిటీని పలువురు అభినందించారు. సోమవారం గాంధీభవన్ లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశానికి మహిళా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ పరిశీలకురాలు కమలాక్షి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రికార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు చేసిన మేడ్చల్ జిల్లాలో తొలి శానిటరీ న్యాప్ కిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వారు ప్రకటించారు. ఈ సమావేశానికి మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి హాజరై కమలాక్షి, సునీతరావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజనోళ్ల లక్ష్మీ మాట్లాడుతూ మహిళా కాంగ్రెస్ సభ్యత్వ నమోదులో దేశంలో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మేడ్చల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు జిల్లాలో శానిటరీ న్యాప్కిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. తద్వారా మహిళలకు ఆర్థిక స్వాలంబన సాధించేందుకు దోహదపడుతుందన్నారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ఇలాంటి కార్యక్రమాన్ని చేపట్టిన అల్కాలంబ, కమలాక్షి, మొగిలి సునీతారావులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపిన మహిళ కాంగ్రెస్ నేతలకు ఆమె ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. మహిళల ఆరోగ్యం, బాలికల రక్షణ దృష్ట్యా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఆమె తెలిపారు. మహిళలు, పిల్లలు సురక్షితంగా ఉండడం, క్యాన్సర్, రీప్రొడక్టివ్ సమస్యలను నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆమె వివరించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో, మురికివాడలలో శానిటరీ న్యాప్ కిన్లను పంపిణీ చేస్తామని తెలిపారు. రాబోయే ఒక సంవత్సరం పాటు ప్రతి నెలా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శానిటరీ న్యాప్ కిన్లను పంపిణీ, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

# ఐటీడీఏ ప్రజా దర్బార్ లో గిరిజనుల వినతుల వెల్లువ



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18 (తెలంగాణ దిశ) :** ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన సోమవారం ప్రజా దర్బార్ కు గిరిజన పెద్ద సంఖ్యలో తరలివచ్చి పలు సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ అందుబాటులో లేనందున ఐటిడిఏ సహాయక ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజుకు పలు సమస్యలపై స్పందించాలని కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సహాయక ఐటిడిప్రాజెక్ట్ అధికారి డేవిడ్ రాజ్ మాట్లాడుతూ తన పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించి మిగతా వాటిని సంబంధిత అధికారులకు తెలియజేస్తామన్నారు. అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడానికి కృషి చేస్తామన్నారు. గిరిజనులు గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలలో ముఖ్యంగా పోడు భూముల పట్టాలతో పాటు పట్టాలలో పేర్లు మార్పు కోసం అర్జీలు సమర్పించాలని తెలిపారు. భూ సమస్యలు, రైతుబంధు రుణాలు, వ్యక్తిగత సమస్యలు, పై చదువులు చదవడం కోసం ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. 90 శాతం సబ్సిడీ ద్వారా గొర్రెలు, మేకలు, గేదెల రుణాల కోసం రుణం, గిరిజన గ్రామాల్లో వ్యవసాయం చేసుకొనుటకు కరెంటు, బోరు, మోటార్ల కోసం వినతి పత్రాలు సమర్పించారని తెలిపారు. పంట పొలాల్లో విద్యుత్ కనెక్షన్లు, మారుమూల గిరిజన గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సౌకర్యం కల్పించుట కోసం వినదు పత్రాలు సమర్పించాలని తెలిపారు. నూతనంగా మత్స్యకార సొసైటీలు ఏర్పాటు, దీర్ఘకాలిక జబ్బుకు వైద్యం చేయించుకొనుటకు ఆర్థిక సహాయం చేయాలని కోరినట్లు తెలిపారు. భద్రాచలం బీఈడీ కళాశాలలో సీట్లు కోసం, నిరుపేద గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఇలా అనేక సమస్యలపై వినతి పత్రాలు వచ్చినట్లు ఐటిఐఏ సహాయక ప్రాజెక్ట్ అధికారి డేవిడ్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ సున్నం రాంబాబు, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ హరీష్, ఎస్ఓ భాస్కర్, డిడి ట్రైబల్ వెల్ఫేట్ పర్యవేక్షకురాలు ప్రమీల బాయ్, కొండరెడ్ల అధికారి రాజారావు ఐసిడిఎస్ సూపర్ వైజర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



# వరంగల్‌లో ఎయిర్‌పోర్ట్ కు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి



**నాగారం, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి వేడుకలను సోమవారం నాగారంలో ఘనంగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బీజేపీ నేత కౌకుట్ల చంద్రారెడ్డి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవంలో నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ"మొగలాయల దౌర్జన్యాలను ఎదిరించి వారి గుండెల్లో సింహ స్వప్నంలా నిలిచిన మహా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. గోల్కొండ (గొల్లకొండ) కోటను గెరిల్లా యుద్ధ పద్ధతులతో కైవసం చేసుకుని, తెలంగాణకు స్వాతంత్ర్య శక్తి, ఆత్మగౌరవాన్ని చాటి చెప్పిన తెలంగాణ ఛత్రపతిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. వరంగల్‌లో నిర్మించబోయే ఎయిర్‌పోర్ట్‌కు మహాయోధుడు



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలని, ఆయన నిర్మించిన కిలాషాపూర్ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్ పిటిసి మునిగంటి సురేష్, నాగారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజ్ యాదవ్, మాజీ ఎంపిటిసి తరిగొప్పుల బలరాం, మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, బీజేపీ నాయకులు పోతంశెట్టి వెంకటేశ్వరరావు, వల్లాల శ్రీనివాస్ గౌడ్, కర్ర వెంకటేశ్వర్, మాధవరావు, ఎలసాని నాగరాజ్ యాదవ్, చెరుకు కిరణ్ గౌడ్, ఏనుగు మహేందర్ రెడ్డి, రామారం గిరిగౌడ్, శ్రీకాంత్ గౌడ్, రమేష్ ముదిరాజ్, శివరాజ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవకుడు సందీప్ కుమార్ కలకుర్తికి ప్రతిష్టాత్మక "డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ అవార్డు"

**సోలాపూర్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :**సామాజిక సేవలో విశేష కృషి చేస్తూ పేద, వెనుక బడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్న సందీప్ కుమార్ కలకుర్తికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ అవార్డు లభించింది. ఈ అవార్డు కార్యక్రమాన్ని యూనివర్సిటీ ఆఫ్ టోలోసా %-% మెక్సికో, ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్స్ అకాడమీ %-% యూకే లిమిటెడ్ నిర్వహించాయి. మహారాష్ట్రలోని సోలాపూర్‌లో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు, సామాజిక నాయకులు పాల్గొన్నారు.


సమాజ సేవలో నిరంతరం కృషి చేస్తున్నందుకు యూనివర్సిటీ ప్రత్యేక సిఫారసు మేరకు ఈ అవార్డు కలకుర్తికి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ కలకుర్తి మాట్లాడుతూ ఈ అవార్డును సమాజానికి అంకితం చేస్తూ తన ప్రయాణంలో తోడ్పడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సమానత్వం, న్యాయం, సాధికారత స్ఫూర్తికి నిలువుటద్దమని పేర్కొన్నారు.




# లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

## - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :**అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన వారికి సిఎం సహాయనిధి మంజూరైన చెక్కులను సోమవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పంపిణీ చేశారు. షాపూర్ నగర్ లో లబ్ధిదారులు ఆసిం బేగం, నునవత్ శంకర్, నునవత్ లక్ష్మణ్ నాయక్ లకు ఈ మేరకు చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేద ప్రజలు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు సిఎంఆర్ఆఫ్ ఆర్థిక సహాయం పేదలకు కొండంత అండగా మారిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని కొనియాడారు. ప్రజా పాలనలో పేద, మధ్యతరగతి ప్రజలకు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా కార్పొరేట్ రంగంలో వైద్యం అందించడంతో పాటు వైద్యానికి అయిన ఖర్చులు సిఎంఆర్ఆఫ్ ద్వారా పేదలకు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## భారత్ పైనే ఎందుకు కోపం?

అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్ మరో 25 శాతం అదనపు సుంకాలు విధించారు. దీంతో ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలతో కలిపి మొత్తం సుంకాలు 50 శాతం కానున్నాయి. అదనపు సుంకాలకు ఆదేశాలిస్తూ, "భారత ప్రభుత్వం ఇప్పటికీ రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది"అని వైట్‌హౌస్ పేర్కొంది. అందుకే అదనపు సుంకాలు విధించినట్లు తెలిపింది. ఈ అదనపు సుంకాలు ఆగస్ట్ 27 నుంచి అమల్లోకి వస్తాయి. రష్యా నుంచి చమురు కొనుగోళ్లలో భారత్ కంటే చైనా ముందున్నప్పటికీ, ప్రత్యేకంగా భారత్‌నే అమెరికా ఎందుకు లక్ష్యం చేసుకుందనేదే ఇక్కడి ప్రశ్న. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహానికి ఇతర అనేక కారణాలున్నాయని నిపుణులు భావిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సమూహం బ్రిక్స్. ఇందులో భారత్, చైనా, రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఇరాన్, ఇథియోపియా, ఇండోనేషియా, ఈజిప్ట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ భాగస్వాములుగా ఉన్నాయి. ఈ దేశాలన్నీ డాలర్‌పై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని భావిస్తున్నాయి. అది అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మింగుడుపడడం లేదు. బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామంటూ ఎప్పటికప్పుడు బెదిరిస్తూ వస్తున్నారు. బ్రిక్స్ దేశాలు తమ సొంత కరెన్సీని తీసుకొస్తే, అమెరికాతో వాణిజ్యానికి వీడ్కోలు పలికేందుకు కూడా సిద్ధంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షలు విధించిన నాటి నుంచి చమురును రూబుల్స్(రష్యన్ కరెన్సీ)లో చైనా కొనుగోలు చేస్తోంది .యూఎస్ కాంగ్రెషనల్ రీసర్చ్ సర్వీస్ ప్రకారం, 2022లో అంతర్జాతీయ వాణిజ్యంలో దాదాపు సగభాగం అమెరికన్ డాలర్లలోనే జరిగింది. డాలర్ ద్వారానే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై అమెరికా ఆధిపత్యం చెలాయిస్తోంది. ఫోర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఇంటర్నేషనల్ బిజినెస్ అండ్ జియోపాలిటిక్స్ ప్రొఫెసర్ ఫైసల్ అహ్మద్, బ్రిక్స్ అంతకంతకూ విస్తరిస్తోందని భావిస్తున్నారు. ఇప్పుడు ఇరాన్ కూడా ఇందులో భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఈ దేశాల మధ్య స్థానిక కరెన్సీ గురించి చర్చ జరుగుతోంది. దాని గురించే అమెరికా భయపడుతోంది. వీళ్లు బలంగా ఉంటే డాలర్ బలహీనమవుతుంది. మరిన్ని సుంకాలు విధిస్తే, ఆర్థిక వ్యవస్థకు హాని కలుగుతుంది. అప్పుడు అమెరికా ఆధిపత్యం అలాగే కొనసాగుతుంది" అని ఆయన అన్నారు. మరోవైపు, థింక్ ట్యాంక్ అయిన గేట్‌వే హౌస్‌లో ఫెలోగా ఉన్న నైనిమా బసు "బ్రిక్స్‌లోని ఇతర దేశాలు చాలా మార్పులు తీసుకురావాలనుకుంటున్నాయి, కానీ భారత్ అలసత్వ వైఖరి కారణంగా వారు అలా చేయలేకపోతున్నారు. అమెరికాతో సంబంధాల కారణంగా భారత్ బ్రిక్స్‌ను బలహీనపరుస్తోందని పదేపదే ఆరోపణలు ఎదుర్కొంటోంది" అన్నారు."అమెరికాపై కేవలం భారత్ ఒక్కటే కాదు, ఇతర బ్రిక్స్ దేశాలు కూడా ఆధారపడ్డాయి. అయినా, అమెరికా నుంచి భారత్ ఇలాంటి సుంకాలను ఎదుర్కొంటోంది" అని తెలిపారు. అమెరికా చాలా ఏళ్లుగా భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. అధ్యక్షుడు ట్రంప్ మొదటి పదవీకాలంలోనూ ఈ ప్రయత్నాలు జరిగాయి, కానీ ఫలించలేదు. వాణిజ్య ఒప్పందం అమెరికాకు భారత మార్కెట్లను తెరుస్తుందని ట్రంప్ విశ్వసిస్తున్నారు, కానీ కొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. భారత్, అమెరికా మధ్య వ్యవసాయ వాణిజ్యం దాదాపు 8 బిలియన్ డాలర్లు(అంటే సుమారు 70 వేల కోట్ల రూపాయలు). భారత్ బియ్యం, సుగంధ ద్రవ్యాలను ఎగుమతి చేస్తుంది. అమెరికా నుంచి డ్రైఫ్రూట్స్, యాపిల్స్, పప్పుధాన్యాలను దిగుమతి చేసుకుంటోంది. అమెరికాకు రాయితీలు కల్పిస్తే, ఇప్పుడున్న మాదిరిగా ఎం.ఎస్.పీ (కనీస మద్దతు ధర)కు రైతుల వద్ద నుంచి పంట ఉత్పత్తులను కొనుగోలు చేయలేమని, ఇది దేశంలో పెద్ద సమస్యగా మారొచ్చని నిపుణులు భావిస్తున్నారు. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లనున్నారు. ఆగస్ట్ 31 నుంచి సెప్టెంబర్ 1 వరకూ ఈ పర్యటన జరగనుంది. గతేడాది అక్టోబర్‌లో, రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ అయ్యారు. 2025 జూన్‌లో, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా బీజింగ్‌లో పర్యటించారు. ఆ తర్వాత విదేశాంగ మంత్రి డాక్టర్ జైశంకర్ కూడా చైనా వెళ్లారు. భారత్, చైనా ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని జామియా మిలియా యూనివర్సిటీలో పొలిటికల్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ రేష్మీ కాజీ అన్నారు."ఏదైనా దేశం అమెరికాను సవాల్ చేస్తోందంటే, అది చైనానే. ఒకప్పుడు ఈ ప్లేస్‌లో రష్యా ఉండేది. కానీ ఇప్పుడు చైనాతోనే అమెరికాకు అతిపెద్ద ముప్పు. చైనాను ఎదుర్కోవాలంటే అమెరికాకు భారత్ అవసరం."“భారత్, చైనా మధ్య కైలాష్ మానసరోవర్ యాత్ర మళ్లీ మొదలైంది. ప్రధాని మోదీ చైనా పర్యటన తర్వాత, బీజింగ్ – దిల్లీ మధ్య ప్రత్యక్ష విమాన సర్వీస్ కూడా ప్రారంభం కావొచ్చని అనుకుంటున్నా. చైనా ఎప్పటి నుంచో ఇది కోరుతోంది. రానున్న రోజుల్లో వీసా పరిమితులను కూడా ఎత్తేయచ్చు" అని నైనిమా బసు అన్నారు.'ఇదంతా అమెరికాకు మింగుడుపడడం లేదు, రష్యా నుంచి చమురు కొంటున్నారంటూ సాకులు చెబుతోంది. ఒకవేళ రష్యా నుంచి చమురు కొనడాన్ని ఆపేస్తే భారత్‌పై అమెరికా సుంకాలు విధించదా?" అని ఆమె ప్రశ్నించారు.'ప్రధాని మోదీ అమెరికా వెళ్లిన సమయంలో, ట్రంప్ భారత్‌ను టారిఫ్ కింగ్ అని సంబోధించారు. అందువల్ల సుంకాలు విధింపును నిలువరించడం కష్టం. అయితే, దానిని కనీసం పరిమితుల్లోపు ఉంచొచ్చు" అని ఆమె అన్నారు. భారత్ విషయంలో ఈసారి ట్రంప్ కఠినంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. గత పదవీ కాలంలో కాస్త మృదువుగా వ్యవహరించినట్లు కనిపించారు. భారత్, పాక్ మధ్యన తన వల్లే కాల్పుల విరమణ జరిగినట్లు ట్రంప్ పదేపదే చెప్పుకుంటున్నారు, అయితే భారత్ మాత్రం కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదని స్పష్టం చేసింది."ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రధాని మోదీ తనకు కొంత క్రెడిట్ ఇవ్వాలని, లేదంటే కనీసం ఒక ఫోన్ కాల్ అయినా చేయాలని ట్రంప్ కోరుకున్నారు. కానీ, అది జరగలేదు. ఇది ట్రంప్ ఆగ్రహానికి కారణంగా తెలుస్తోంది" అని బసు అన్నారు. నాన్ టారిఫ్ నిబంధనలపై అమెరికా చాలా కాలంగా తన అసంతృప్తిని వ్యక్తం చేస్తోంది. భారత్‌పై ట్రంప్ అసంతృప్తికి ఇదో పెద్దకారణం. ప్రతి దేశం నాన్ టారిఫులు విధిస్తున్నప్పటికీ , అమెరికా అందులోనూ మినహాయింపు కోరుకుంటోంది.""భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం. అమెరికా అభివృద్ధి చెందిన దేశం. అందువల్ల రెండు దేశాలనూ ఒకేలా చూడలేం. దేశీయంగా ఉత్పత్తిని ప్రోత్సహించడంపై భారత్ దృష్టి పెట్టింది" అని ఫైసల్ అహ్మద్ విశ్లేషించారు.

# కృష్ణాష్టమి వేడుకల్లో అపశృతి.. ఆరుగురు దుర్మరణం



రామంతాపూర్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :రామంతపూర్ గోకుల్ నగర్ లో కృష్ణాష్టమి వేడుకల సందర్భంగా శ్రీకృష్ణుడి శోభాయాత్రలో విషాదం చోటుచేసుకుంది. రథాన్ని తోసుకుంటూ వెళ్తున్న సమయంలో విద్యుత్ తీగలు తాకడంతో.. కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే ఐదుగురు మృతి చెందారు.. మరొకరు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందారు. మృతులు కృష్ణ యాదవ్ (24), శ్రీకాంత్ రెడ్డి (35), సురేష్ యాదవ్ (34), రుద్ర వికాస్ (39), రాజేంద్ర రెడ్డి (39) కాగా సీరియస్ గా ఉన్న మరో నలుగురిని వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శ్రీకృష్ణ శోభాయాత్రలో విద్యుత్ షాక్ తో ఐదుగురు మృతి చెందడం బాధాకరమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మృతులు రాజేందర్ రెడ్డి, వికాస్, శ్రీకృష్ణ, శ్రీకాంత్, సురేష్ యాదవ్ ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపాన్ని వ్యక్తం చేసారు. వారి కుటుంబాలకు అండగా ఉంటానని తెలిపారు.

**మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : ఈటెల**

శోభాయాత్ర సందర్భంగా జరిగిన దుర్ఘటనలో ఆరు మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేసారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేసారు.



**బాధితులకు ఎక్స్ గ్రేషియా ప్రకటించిన ప్రభుత్వం**

రామంతాపూర్ కరెంట్ షాక్ ఘటనలో ఆరుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాధితులకు న్యాయం చేయాలంటూ అక్కడ స్థానికులు నిరసన చేపట్టి నినాదాలు చేశారు. ఈ మేరకు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాక ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రులకు వైద్యం అందించాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు.



# బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

### - ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బిజెపి నేత బేతి సుభాష్ రెడ్డి


### - హెచ్ బి కాలనీలో ఘనంగా పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

హెచ్ బి కాలనీ, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :మౌలాలి హెచ్ బి కాలనీ కౌండిన్య గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375 వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్లు శ్రీనివాస్ రెడ్డి, అంజయ్య తదితరులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గీత కార్మికుల ఇంటిలో పుట్టి దొరల పెత్తందార్ల ఆగడాలకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రధానంగా రాజ్యాధికారం కోసం పోరాటం చేశారు. విద్యార్థులు యువత ప్రజలు విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు. అప్పుడే ఆయనకు మనం నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ బి కాలనీ కౌండిల్య గౌడ సంఘం సలహాదారులు మల్లేష్ గౌడ్, అధ్యక్షులు కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

### - మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి



కుత్బుల్లాపూర్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని మాజీ కార్పొరేటర్ గుడిమెట్ల సురేష్ రెడ్డి అన్నారు. సూరారం కాలనీ తెలుగు తల్లి నగర్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకల్లో భాగంగా పాపన్న విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ పీడిత జనుల కోసం, బహుజనుల ఆత్మ గౌరవం కోసం తన సర్వస్వాన్ని ధారబోసిన మహాయోధుడు సర్వాయి పాపన్న అని అన్నారు. నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పాపన్న గౌడ్ తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమన్నారు. సామాజిక, రాజకీయ సమానత కోసం కృషి చేసిన బహుజన వీరుడు సర్వాయి పాపన్న పోరాటస్ఫూర్తిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతోనే గత కేసీఆర్ ప్రభుత్వం సర్దార్ సర్వాయి పాపన్న జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. సామాజిక విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్న గొప్పతనాన్ని స్మరించుకుంటూ..అందరు అతని అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న గౌడ సంఘ సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి ఉద్ధృతి




భద్రాచలం, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :భద్రాచలం వద్ద గోదావరి వరద ఉద్ధృతి పెరుగుతోంది ప్రస్తుతం గోదావరి నీటిమట్టం 38 అడుగులకు చేరుకోగా క్రమంగా పెరుగుతూ 43 అడుగులుదాటి ప్రవహించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు, గోదావరి వరద ఉద్ధృతి 43 అడుగులకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులను ఎప్పటికప్పుడు గజ ఈతగాళ్లు అలర్ట్ చేస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటించాలని కోరుతున్నారు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్. స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాల కోసం వెళ్లిన భక్తులకు లోతుకు వెళ్లొద్దని పోలీసులు హెచ్చరికలు జారీచేశారు.

**పర్ణశాలలో నీట మునిగిన సీతమ్మ విగ్రహం**

పర్ణశాల వద్ద గోదావరి నదీ ఉద్ధృతి పెరగడంతో ఎగపోటు కారణంగా సీతవాగు ఉప్పొంగడంతో సీతమ్మ విగ్రహం పూర్తిగా నీటమునిగిపోయింది. పర్ణశాలలో సీతారామలక్ష్మణుడు ఆడుకున్న వామన గుంటలు, రాముడి రాతి సింహాసనం, సీతమ్మ నారచీరలు, శూర్పణక్క గుట్ట ప్రాంతం అంతా నీటమునిగింది. వరదల వల్ల భక్తుల రాక



లేకపోవడంతో పర్ణశాల ఆలయంతో పాటు కుటీర ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది.



# ఆపదలో చేయూత... సీఎంఆర్ఎఫ్

### - కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి




కుత్బుల్లాపూర్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :అనారోగ్య రీత్యా ఆపదలో ఉన్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ చేయూత నిస్తుందని కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ కు చెందిన ఎన్. సంజీవ్ కుమార్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు ఎంఎన్ జె క్యాన్సర్ హాస్పిటల్ లో చికిత్స పొందుటకు ఆర్థిక స్థోమత లేదని తెలుసుకున్న హన్మంత్ రెడ్డి వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితుడికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 5 లక్షల ఎల్‌ఓసి మంజూరీ చేయించారు. ఈ ఎల్‌ఓసి పత్రాన్ని సోమవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో సంజీవ్ కుమార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవ్ రెడ్డి,కొలన్ రాజశేఖర్ రెడ్డి, కొలన్ జీవన్ రెడ్డి, రజాక్, సమీర్ ఖాన్, అమీర్, షఫీ, శంకర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# నాగారం జ్యోతి రిహాబిలిటేషన్ సెంటర్ లో హత్య...



కీసర, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :కీసర పోలీస్ స్టేషన్ పరిధి నాగారం జ్యోతి రిహాబిలిటేషన్ సెంటర్ లో హత్య జరిగింది. బాధితుల వివరాలు ప్రకారం మల్కాజిగిరి వినాయక్ నగర్ చెందిన బైరాగోని కృష్ణ గౌడ్ (50) మద్యానికి బానిస కావడంతో కుటుంబ సభ్యులు 15 రోజుల క్రితం రిహాబిలిటేషన్ సెంటర్లో చేర్పించారు. ఇక్కడే ఉంటున్న రాజశేఖర్ అనే వ్యక్తితో వివాదం తలెత్తింది. ఈ సందర్భంలో రెండవ అంతస్తులో కయ్యుమ్ మూడవ అంతస్తుకు తీసుకెళ్ళి కాల్చిన ఇనుప కిటికీ కడ్డీతో పాటు ఛాతీపై, చేతులతో కొట్టారు. ఈ గొడవలో కృష్ణ గౌడ్ మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు కయ్యుమ్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# కలెక్టరేట్ లో ఘనంగా సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి ఝాన్సీ రాణి లతో కలిసి పాపయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.**

(మేడ్చల్ కలెక్టరేట్, తెలంగాణ దిశ)

# క్రెడిట్ వార్...?!

హైదరాబాద్ (తెలంగాణ దిశ) తెలంగాణ వాటర్ వార్‌లో నయా ట్రెండ్ షురూ అయింది. ప్రాజెక్టులు, వాటి ఖర్చుల లెక్కలు, అవినీతి ఆరోపణలు, అంకెలు–రంకెలు పక్కకుపోయాయి. ప్రస్తుతం నీటి పారుదల రాజకీయం ప్రవహిస్తోంది. ప్రాజెక్టుల చుట్టూ లేటెస్ట్ పొలిటికల్ రౌండ్ షురూ అయింది. ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల విషయంలో అధికార ప్రతిపక్షాల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గత బీఆర్ఎస్ సర్కార్?సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసిందని అధికార కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ప్రాజెక్టుల నుంచి కాంగ్రెస్ సర్కార్ విడుదల చేస్తున్న ప్రతి నీటిబొట్టు తమ కష్టమే అంటోంది గులాబీ పార్టీ. నీటి విడుదల తమ పుణ్యమే అంటూ క్లెయిమ్ చేసుకుంటోంది బీఆర్ఎస్..లేటెస్టుగా భద్రాద్రి సీతారామ ప్రాజెక్ట్ నుంచి గోదావరి జలాలను విడుదల చేశారు. అశ్వాపురం మండలం బీ.జీ. కొత్తూరు దగ్గర.. మొదటి లిఫ్ట్ పంప్ హౌస్ నుంచి గోదావరి జలాలు ప్రవహించాయి. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల ఆలస్యం కావడంతో.. పంటలు ఎండకుండా గోదావరి జలాలను విడుదల చేసినందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. ఇదంతా తమ కష్టమే అంటోంది బీఆర్ఎస్. గతంలో కేసీఆర్ ముందుచూపుతో గోదావరి జలాలను ఖమ్మం జిల్లాకు తరలించి సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు ఫలాలు రైతులకు అందడం సంతోషం గా ఉందన్నారు మాజీ మంత్రి హరీష్ రావు. సీతారామ ప్రాజెక్టు మోటార్లు ఆన్ చేసినట్టే, కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి మోటార్లు ఆన్ చేసి సాగు నీటి కోసం ఎదురుచూస్తున్న రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు హరీష్. ఈమేరకు ఆయన చీలో పోస్ట్ చేశారు. సీతారామ ప్రాజెక్ట్ నుంచి జలాల విడుదల క్రెడిట్ తమదేనంటూ చెప్పకనే చెప్పారు హరీష్. ఇక కొద్ది రోజుల ముందు కల్వకుర్తి ప్రాజెక్టు నీటిని విడుదల చేశారు.

# కాంగ్రెస్ లో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తప్పక గుర్తింపునిస్తాం

## స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు తగిన ప్రాధాన్యత ఇస్తాం - టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్






**హైదరాబాద్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :** కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు తప్పకుండా గుర్తింపును ఇస్తామని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. సోమవారం గాంధీభవన్ లో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి మహిళా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ పరిశీలకురాలు కమలాక్షి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పదవులు రాలేదని మహిళ నేతలు నిరాశ పడవద్దని, మహిళ కాంగ్రెస్ నేతలకు సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళ కాంగ్రెస్ కు తగిన ప్రాముఖ్యత నిస్తామని అన్నారు. మహిళ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

భారతరత్న మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా “నారి మహిళా ఆరోగ్య సంకల్పం” మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కాలాంబ నిర్దేశం మేరకు కమలాక్షి సునీతా రావులతో కలిసి పోస్టర్ ను మహేష్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమలాక్షి మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం, బాలికల రక్షణ దృష్ట్యా మహిళా కాంగ్రెస్ ఉచితంగా శానిటరీ న్యాప్ కిన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. ఇందులో భాగంగా తెలంగాణలోని అన్ని జిల్లాలకు శానిటరీ న్యాప్ కిన్లను అందజేస్తామన్నారు. మహిళలు, పిల్లలు సురక్షితంగా ఉండడం, క్యాన్సర్, రీప్రొడక్టివ్ సమస్యలను నివారించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె వివరించారు. మహిళలందరూ కలిసి పని చేయాలని, సీనియర్లకు మర్యాద ఇవ్వాలని ఆమె సూచించారు. సమిష్టిగా పని చేసి మహిళా కాంగ్రెస్ ను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు సద్వినియోగం చేసుకునేందుకు మహిళలందరూ సమన్వయంతో కలిసి నడవాలని సూచించారు. మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు మాట్లాడుతూ త్వరలో మేడ్చల్ జిల్లాలో శానిటరీ న్యాప్ కిన్ వెండింగ్ మిషన్ ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 20వ తేదీ స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలా మహిళ కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో, మురికివాడలలో శానిటరీ న్యాప్ కిన్లను పంపిణీ చేస్తామని తెలిపారు.



రాబోయే ఒక సంవత్సరం పాటు ప్రతి నెలా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శానిటరీ న్యాప్ కిన్లను పంపిణీ, అవగాహన కార్యక్రమాలను జిల్లాల వారిగా నిర్వహిస్తామని తెలిపారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చంద్రిక ప్రసాద్, నీలం పద్మ, పడమటి పావని రెడ్డి, శంభుల ఉషశ్రీ, కవిత, రాజనోళ్ల లక్ష్మి, సుగుణ రాజేష్, బద్దినేని అనంతలక్ష్మి, పోరిక అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

## - టు వీలర్ ని ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్





భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 18, (తెలంగాణ దిశ) :భద్రాచలంలో ఇసుక మాఫియాకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. కూనవరం రోడ్డులో డిగ్రీ కళాశాల ఎదురుగా అక్రమ ఇసుక తోలుతున్న ట్రాక్టర్ అధిక వేగంతో వెళుతూ టూ వీలర్ ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తికి గాయాలవ్వటంతో స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఒక పక్క గోదావరి పరో పక్క భారీగా వర్షాలు పడుతున్న ఇసుక మాఫియా ఆగడాల మాత్రం ఆగటం లేదు. సామి రంగ దొరికింది భలే ఛాన్స్ లే అనుకున్నారో ఏమో.. సంబంధిత అధికారులు పట్టించుకోరులే... అనే ఆనందంతో ఇష్టారాజ్యంగా ఆంధ్ర నుంచి డంపు చేసిన ఇసుకను ట్రాక్టర్లతో భద్రాచలం పట్టణంలో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ద్విచక్ర వాహన దారున్ని ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఏది ఏమైనా ఆంధ్ర నుంచి వస్తున్న ఇసుక ట్రాక్టర్లను అక్రమంగా నడుస్తున్న ఇసుక తందాను సంబంధిత అధికారులు పట్టించుకుంటే ఇలాంటి ప్రమాదాలు జరగవని స్థానికులు తెలుపుతున్నారు.

# ఈసిఐఎల్ లో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలు

## ట్యాంక్ బండ్ పై పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటు హర్షణీయం




**కుషాయిగూడ, ఆగస్టు 18, (తెలంగాణ దిశ):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 375వ జయంతి సందర్భంగా సోమవారం ఈసిఐఎల్ చౌరస్తాలో గౌడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ జేఏసి రాష్ట్ర కో కన్వీనర్ ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నేడు పాపన్న జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ వద్ద పాపన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు.

అసోసియేషన్ అధ్యక్షులు తాళ్ళ ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఎక్స్ గ్రేషియా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గౌడ హాస్టల్ మేనేజింగ్ కమిటీ సభ్యులు పండాల శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ గౌడ వృత్తిదారులు రోజుకు ఒకరు ఇద్దరు చెట్టుపై నుండి పడి మరణిస్తున్నారని, ప్రభుత్వం వృత్తిదారులకు సేఫ్టీ మోకులు అందించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సంఘ కోశాధికారి బుడంపల్లి నిరంత్ గౌడ్, అఖిల భారత గౌడ సంఘం కోళ్ళ ఈశ్వర్ ప్రసాద్ గౌడ్, ఈసిఐఎల్ రిటైర్డ్ జిఎం పి. శ్రీనివాస్ గౌడ్, సంకూరి శ్రీనివాస్ గౌడ్, దూడల సాంబమూర్తి గౌడ్, రుద్రగోని రామచందర్ గౌడ్, తాళ్ళ వెంకటేష్ గౌడ్, దేవనాథం, రాజు వంశరాజ్, లక్ష్మణ్ గౌడ్, దినేష్, కీసర ప్రేమ్ గౌడ్, బుడంపల్లి రఘుపతి గౌడ్, పండాల గణేష్ గౌడ్, పుట్ట సహదేవ్ గౌడ్, ఎరుకల రామచందర్ గౌడ్, బుడంపల్లి వెంకటేష్ గౌడ్, నూనెముంతల రంజిత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వారికి నాగ పడగల ఆభరణం బహుకరణ






**కీసర, ఆగస్టు 18, (తెలంగాణ దిశ)** :భక్తి శ్రద్ధలతో సమర్పించిన విరాళాలతో ఆలయాభివృద్ధి కార్యక్రమాలకు ఎంతో దోహదం చేస్తుందని కీసర శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ తటాకం నారాయణ శర్మ అన్నారు. సోమవారం కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు బంగారు ఆభరణాలను విరాళంగా సమర్పించారు. సిక్ విలేజ్ టాడ్ బండ్ కు చెందిన సదా నరసింహా రెడ్డి, పుష్పలత దంపతులు స్వామి వారికి బంగారు తాపడం కలిగిన నాగ ఆభరణం (నాగ పడగలు)ను సమర్పించారు. బహుకరణ విలువ సుమారు రూ. 6.50 లక్షలు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు బలరాం శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారికి నాగ ఆభరణాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ కట్టా సుధాకర్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు కౌకుంట్ల కృష్ణారెడ్డి, నల్ల మధుసూదన్ రెడ్డి, ప్రవీణ్, రాజిరెడ్డి, పోచబోయిన రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మనబోలులో ఘనంగా సర్దార్ పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



**మోటకొండూర్, ఆగస్టు 18, (తెలంగాణ దిశ):**యాదాద్రి జిల్లా మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామంలో సర్దార్ పాపన్న గౌడ్ 375 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత,
.. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పీడిత జనుల కోసం, బహుజనుల ఆత్మగౌరవం కోసం తన సర్వస్వాన్ని దారబోసిన మహాయోధుడు పాపన్న అని కొనియాడారు.

నిరంకుశ పాలనకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పాపన్న గౌడ్ తెలంగాణలో పుట్టడం మనందరికి గర్వకారణమన్నారు.

# జయంతిపురంలో మిస్సైల్ కేంద్రం..!

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నియోజకవర్గంలో రక్షణ పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బ్రహ్మోస్ క్షిపణుల తయారీ యూనిట్‌తో పాటు మరికొన్ని రక్షణ రంగ సంస్థలు ఇక్కడ తమ యూనిట్లను నెలకొల్పనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రానికి లేఖ రాయడంతో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు శర వేగంగా అడుగులు పడుతున్నాయి. జయంతిపురం, పెద్దవరంలో ఇందుకోసం వందల ఎకరాల భూమి అందుబాటులో ఉంది. దీనివల్ల ఈ ప్రాంతానికి దేశీయంగా గుర్తింపు రావడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నియోజకవర్గం రూపు రేఖలు మారబోతున్నాయి. ఈ ప్రాంత ప్రజలకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఎలా అంటే జగ్గయ్యపేట నియోజకవర్గంలో రక్షణ పరిశ్రమల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. బ్రహ్మోస్ క్షిపణుల తయారీ సంస్థ ప్రతినిధులు తాజాగా ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. త్వరలో ఇక్కడ తమ యూనిట్‌ను నెలకొల్పే దిశగా అడుగులు ముందుకు వేస్తున్నారు. బ్రహ్మోస్‌తో పాటుగా మరికొన్ని కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగ సంస్థలు కూడా ఇక్కడ తమ యూనిట్లను ఏర్పాటు చేయనున్నాయి. 19న కేంద్రానికి లేఖ రాశారు. జగ్గయ్యపేటలో మిసైల్స్, ఆయుధ తయారీ పరిశ్రమలను నెలకొల్పాలని ఆయన లేఖలో కోరారు. ఈక్రమంలోనే జగ్గయ్యపేటలో డిఫెన్స్ క్లస్టర్ ఏర్పాటుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. బ్రహ్మోస్ ఏరోస్పేస్ డిఫెన్స్ కార్పొరేషన్ సీఎండీ ఆధ్వర్యంలోని బృందం ఈ ప్రాంతాన్ని ఇప్పటికే రెండుసార్లు సందర్శించా.. యూనిట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించింది.

# వైజాగ్ లో పేకాట క్వీన్స్



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** కాలం మారిపోయింది. ఎన్నో రకాల రుగ్మతలు సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. ముఖ్యంగా మానవ తప్పిదాలు పెరుగుతున్నాయి. జూదమాటలతో పాటు వ్యసనాల బారిన ఎక్కువ మంది పడుతున్నారు. అయితే ఇప్పుడు మహిళలు కూడా వ్యసనాల బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. విశాఖపట్నంలోజూదం ఆడుతూ ఆరుగురు మహిళలు పోలీసులకు పట్టుబడటం విశేషం. ఇప్పటివరకు పురుషులే జూద మాటలు ఆడడం చూస్తుంటాం. కానీ ఇప్పుడుమహిళలు సైతం అనుసరించడం ఆందోళన కలిగిస్తోంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉ న్నాయి. ఓ భర్త, ఇంట్లో భార్య రోజూ బయటకు వెళ్లి రావడాన్ని గమనిస్తూ, పేకాట ఆడుతోం దని అనుమానంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. మొదట్లో స్థానిక పోలీసు స్టేషన్లో అతని ఫిర్యాదును పట్టించుకోకపోయినా, పైఅధికారి స్థాయిలోచెప్పడంతో వ్యవహారం ఊహించని మలుపు తిరిగింది. చివరకు పోలీసుల దాడిలో అసలు గుట్టు వెలుగులోకి వచ్చింది. పట్టుబడిన వారు ఎవరూ ఊహించని విధంగా మహిళలు కావటం, అంతా ఒకే ప్రాంతంలో కూర్చుని పేకాట ఆడుతుండటం స్థానికులను ఆశ్చర్యకితులను చేసింది. గుట్టు చప్పుడు కాకుండా? గుట్టు రట్టు విశాఖలోని ఒక నివాస భవనం పేకాట 'అడ్డా'గా మారింది. నిత్యం పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలు లలిత నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో రొటీన్‌గా జూదంలో మునిగిపోయారు. అయితే మామూలు గా ఎవరికీ అనుమానం రాకుండా వ్యవహరిస్తూ వస్తుండగా, భర్త తన భార్యపై పెట్టిన అనుమానం పోలీసులకు ఫిర్యాదుగా మారింది. టాస్క్ ఫోర్స్‌రంగంలోకి.. ఆరుగురు మహిళలు అదుపులోకి భర్త ఫిర్యాదుతర్వాత నగరంలోని టాస్క్ ఫోర్స్ పోలీసులు సీక్రెట్‌గా సమాచా రం సేకరించి, లలిత నగర్‌లో ఆ ఇంటిపై దాడి చేశారు. సరిగ్గా అందరూ ఆటలో ఉండగా.. పోలీసులు అక్కడికి చేరుకొని ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి రూ.22, 000నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు, దర్యాప్తు టాస్క్ ఫోర్స్ పోలీసులు ఇప్పటివరకు ఆ మహిళల వివరాలు సేకరించి, స్థానిక పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. అంతే కాకుండా, ఈ గృహం ఎవరిది? ఇలాంటివే ఇంకెన్ని ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. పట్టుబడిన మహిళలు సంతానం తో ఉన్న గృహిణులు కావటం, ఆర్థిక అవసరాలు లేదా మోజు కారణంగా ఇలా జరిగిందా అన్నదానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇంటి తలుపులు మూసుకుని.. పేకాటలో మునిగిన రాణులు ఈ ఘటన వెలుగులోకి రావడంతో ఆ ప్రాంత ప్రజలలో ఆందోళన నెల కొంది. ఇక్కడ ఇలాంటి పనులు జరుగుతున్నాయనేది ఊహించలేదు.. గృహిణులు ఇలాంటివి చేస్తే పిల్లలకు ఏం బుద్ధి వస్తుంది? అంటూ కొంతమంది స్థానికులు మాట్లాడారు. ఇక పట్టుబడిన మహిళల కుటుంబ సభ్యులు మాత్రం మౌనమే వహిస్తున్నారు. ఆడవాళ్లు ఇలాంటివి చేస్తే కుటుంబం నాశనం అవుతుందని కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. విశాఖపట్నం లలితా నగర్ ప్రాంతంలో ఓ ఇంట్లో మహిళలు గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే నాలుగో పట్టణం పోలీసు లు రంగంలోకి దిగారు.టాస్క్ ఫోర్స్ పోలీసులతో కలిసి దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి దగ్గర నుంచి 22వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఈ ఘటన కలకలం రేపింది.అయితే ఈ మహిళలు తరచూ వారి ఇళ్లలో పేకాట ఆడుతున్నట్లు తెలుస్తోంది. ఓ అజ్ఞాత వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు రంగంలోకి దిగిఅరెస్టు చేసినట్లు ప్రచారం జరుగు తోంది. అయితే ఈ ఆరుగురు మహిళల్లో ఓ మహిళ భర్త గతంలోనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఎటువంటి చర్యలు లేకపోవడంతో నేరుగా పోలీసు ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయగా.. వారు యాక్షన్ లోకి దిగినట్లు సమాచారం. లలితా నగర్ ప్రాంతంలో ఒక భవనంలో మినీ పేకాట క్లబ్ నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉ న్నాయి. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అక్కడ నిత్యం మహిళలు కనిపిస్తుంటారు. గతంలో ఓసారి మహిళలు పేకాడుతూ పట్టుపడగా పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించి విడిచి పెట్టారట. ఇప్పుడు నేరుగా కుటుంబ సభ్యుడే ఫిర్యాదు చేయడంతో.. నేరుగా పోలీసులు రంగంలోకి దిగారు. మహిళలను అరెస్టు చేశారు. అయితే పేకాట ఆడుతూ మహిళలు పట్టుబడడం విశాఖలో మాత్రం సంచలనంగా మారింది.




## బ్యాంకుల పరిధిలోనే మినిమమ్ బ్యాలెన్స్ వ్యవహారం

**ఈ వ్యవహారం ఆర్‌బిఐ పరిధిలో లేదన్న గవర్నర్ మల్హోత్రా**

గాంధీనగర్: బ్యాంకులో ఖాతాదారుల అకౌంట్స్‌లో మినిమమ్ బ్యాలెన్స్ నిబంధన అన్నది ఆయా బ్యాంకులకున్న స్వేచ్ఛ అని, ఇందులో ఆర్‌బిఐ జోక్యం ఉండదని ఆర్‌బిఐ స్పష్టం చేసింది. బ్యాంకు ఖాతాల్లోని కనీస నిల్వల అంశంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పందించారు. మినిమమ్ బ్యాలెన్స్ ఎంత ఉండాలనేది పూర్తిగా బ్యాంకుల నిర్ణయమని చెప్పారు. దీనిపై ఆర్‌బీఐ నియంత్రణ ఏదీ ఉండదని పేర్కొన్నారు. కనీస బ్యాలెన్స్ పరిమితిని ఐసీఐసీఐ బ్యాంక్ గరిష్ఠంగా రూ. 50 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్న వేళ గుజరాత్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమం పాల్గొన్న సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ మీడియాతో మాట్లాడారు. కనీస సగటు- బ్యాలెన్స్ ఎంత ఉండాలి అనే నిర్ణయం ఆర్‌బీఐ బ్యాంకులకే వదిలేసింది. కొన్ని బ్యాంకులు రూ. 10వేలు నిర్ణయిస్తాయి. మరికొన్ని రూ. 2 వేలు ఉంచుతాయి. కొన్ని కనీస బ్యాలెన్స్ నిబంధనను ఎత్తివేశాయి. ఈ అంశం ఆర్‌బీఐ నియంత్రణ పరిధిలోకి రాదని సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. పొదుపు ఖాతాల్లో కనీస నిల్వ లేనిపక్షంలో విధిస్తున్న అపరాధ రుసుమును ఇటీవల కొన్ని బ్యాంకులు ఎత్తివేస్తుండగా, ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అందుకు భిన్నంగా ఖాతాదార్లకు షాకిచ్చింది. సేవింగ్స్ అకౌంట్లోల కనీస నిల్వ మొత్తాన్ని భారీగా పెంచేసింది. ఆగస్టు 1 తర్వాత ఖాతా తెరిచిన వారికే ఇది వర్తించనుంది. మెట్రో, అర్బన్ ప్రాంతాల్లో ఖాతాదార్లు కనీసం రూ. 50,000 నిల్వ ఉంచాలి. గతంలో ఈ మొత్తం రూ. 10,000గా ఉండేది. ఇప్పుడు ఏకంగా 5 రెట్లు- పెంచేసింది. సెమీ అర్బన్ ఖాతాదార్ల కనీస నిల్వ మొత్తాన్ని రూ. 5,000 నుంచి రూ. 25,000కు, గ్రామీణ ఖాతాదార్లకు రూ. 2,500 నుంచి రూ. 10,000కు సవరించింది. కనీస నిల్వ లేనిపక్షంలో ఛార్జీలు కనీస నిల్వకు ఎంత తక్కువ మొత్తం ఉంటు-ందో దానిపై 6 శాతం లేదా రూ. 500 ఏది తక్కువైతే అది చెల్లించాల్సి ఉంటుందని ఐసీఐసీఐ బ్యాంక్ వెల్లడించింది. అయితే దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ





మంథని: మంథని మండల వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాల లోని విద్యార్థిని, విద్యార్థులకు మంథని (గద్దలపల్లి) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సృజన్ ఆధ్వర్యంలో నూలిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భ ంగా కాకతీయ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ సృజన్ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువులో రాణించవచ్చన్నారు. జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశామ న్నారు. పిల్లల్లో ఎదుగుదలకు అవరోధంగా నిలిచే నులిపురుగుల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు.మంథని మండల వ్యాప్తంగా15,477 మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలను వేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మేరీసంపూర్ణ, హెచ్ఓ శ్రీనివాస్,ఉమాదేవి,ఎంఎల్ హెచ్ పి.శ్రావణి,సూపర్వైజర్లు ఉమాదేవి,సరస్వతి, శ్వేత,ఆశ వర్కర్లు రాధ అనురాధ,రమ,రేవతి, సంధ్య,సిబ్బంది.పాల్గొన్నారు.

## ఫ్యాన్ గూటికి వర్మ నిజమెంత..?



**కాకినాడ,తెలంగాణ దిశ** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం అనగానే వెంటనే గుర్తుకు వచ్చేది ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఆ తరువాత అక్కడ టీడీపీ తరపున నియోజకవర్గ ఇంచార్జ్‌గా ఉన్న వర్మ. తన సీటు పవన్ కల్యాణ్ కోసం త్యాగం చేయడమే కాదు.. దగ్గరుండి పవన్ కల్యాణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు వర్మ చేసిన కృషిని ఎవ్వరూ కదనలేరు. ఎందుకంటే పిఠాపురం నియోజకవ ర్గం వర్మతో అంతలా అనుబంధం కలిగి ఉంటుంది.పిఠా పురానికి రెండు సార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన వర్మ ఒకసారి స్వతంత్ర్య అభ్యర్థిగా మరోసారి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. అలాంటి వర్మపై పిఠాపురం నియోజకవర్గంలోనే కాదు కాకినాడ జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియాలోఓ ప్రచారం జరుగుతోంది. ఆయన వైసీపీలోకి వెళు న్నారనే ప్రచారం జోరందుకుంది. కూటమిలో ప్రాధాన్యత ఇవ్వడం లేదనే అసంతృప్తితో వర్మ ఉన్నారని అందుకే పక్కచూపులు చూస్తున్నా రని ఆ ప్రచారం సారాంశం.వర్మ టీడీపీకి వీరాభిమాని. చంద్రబాబు, లోకేష్ అంటే ఎంతో ఇష్టం. అలాంటి వర్మ పార్టీ మారడం అనేది ఫేక్ ప్రచారంగా చాలా మంది కొట్టిపారేస్తున్నారు. అయితే పవన్ కల్యాణ్‌ను గెలిపించడంలో వర్మ పాత్ర లేదని ఎవరూ కాదనలేని నిజం. ఆ తర్వాత కూటమి ఆయనకు ఇవ్వాల్సిన ప్రాధాన్యత ఇవ్వడం లేదనే విమర్శ ఉంది. ఆయనకు ఇస్తామన్న ఎమ్మెల్సీ పదవి ఇంతవరకు చర్చకు రాలేదు. జనసేన నాయకులు ఆయనపై విమర్శలు చేయడం వంటి పరిణామాలు జరుగుతున్న ప్రచారం నిజమని నమ్మేవాళ్లు లేకపోలేదు.మాజీ ఎమ్మెల్యే, పిఠాపురం టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వర్మ వైసీపీలో చేరుతున్నారన్న ఆరోపణలు గందరగోళానికి తెరలేపాయి. నిజంగానే వర్మ టీడీపీను వదిలి వైసీపీలో చేరుతున్నారా.. అనే చర్చ కూడా పిఠాపురం నియోజకవర్గంలోనే కాదు మొత్తం కాకినాడ జిల్లాలో సాగుతోంది. మొన్నటి ఎన్నికల్లో వర్మను కూటమి ప్రభుత్వం ఉపయోగించుకుని కరివేపాకులా తీసేస్తుందని, ఇస్తానన్న ఎమ్మెల్సీ పదవిని కూడా ఇవ్వలేదని, జనసేన ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు వ్యాఖ్యలు ఇలా వర్మను పూర్తిగా అసంతృప్తిలోకి నెట్టాయని అంటున్నారు.

ఈ కారణంతోనే ఆయన టీడీపీకి రాజీనామా చేసి వైసీపీలో చేరుతున్నారని సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతోంది. వర్మపై కావాలనే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పిఠాపురం టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. కావాలని ఆయన్ని రాజకీయంగా దెబ్బ తీసేందుకు ఇలాంటి ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారని అంటున్నారు. విమర్శలతో ఆగకుండా పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో భారీగా తరలివచ్చిన వర్మ అభిమానులు, అనుచరులు సోషల్ మీడియా, యూట్యూబ్‌లో తప్పుడు ప్రచారం చేసిన వ్యక్తులపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.వర్మ టిడిపికి రాజీనామా చేస్తున్నారని, వైసీపీలోకి చేరుతు న్నారని వంటి కల్పిత వార్తలను ప్రచారం చేసి, ఆయన రాజకీయ భవిష్యత్తును దెబ్బతీసేలా తప్పుడు వార్తలను ఇటీవల ప్రచారం చేశారు. పిఠాపురం టిడిపి నాయకులు ఈ తప్పుడు వార్తలను తీవ్రంగా ఖండించారు. సోషల్ మీడియాలో ఆధారం లేని వార్తలను ప్రచారం చేసి, వర్మ వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతీసేందుకు ప్రయత్నించిన వారిపై పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

## విద్యార్థులకు మంచు లక్ష్మి భరోసా..




**రాజేంద్రనగర్,తెలంగాణ దిశ :** విద్యార్థులకు ఏ అవసరం వచ్చినా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సినీనటి మంచు లక్ష్మి హామీ ఇచ్చారు. నార్సింగి మున్సిపల్ పరిధిలోని జన్వాడ గ్రామంలో ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని బాలికలకు సినీ నటి మంచులక్ష్మీ, రత్నారెడ్డి తదితరులు శానిటరీ ప్యాడ్స్, ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ఆమె పాల్గొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ తన నియోజకవర్గంలో మంచి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సినీ నటిమంచు లక్ష్మీకి ధన్యవాదాలుతెలిపారు. విద్యార్థుల కోసం డిజిట ల్ స్మార్ట్ క్లాస్ రూమ్ ఏర్పాటు చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. మంచు లక్ష్మీ 'టీచ్ ఫర్ చేంజ్' రత్నా రెడ్డి 'వేని రావు ఫౌండేషన్' తెలంగాణలో విద్యా ఆరోగ్య కార్యక్రమా లను విస్తరించడం ఎంతో గొప్ప విషయమన్నారు. లక్ష్మీ మంచు స్థాపించిన టీచ్ ఫర్ చేంజ్ సంస్థ, సేవాభావి రత్నా రెడ్డి నేతృత్వం లోనివేనిరావు ఫౌండేషన్ తో కలిసి తెలంగాణలో ప్రభుత్వ పాఠశాల ల్లో చదువుతున్న బాలికల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం, ఆరోగ్య ఫలితాలను అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తుందన్నా రు. తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల్లో 45 స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ఏర్పాటును కొనసాగిస్తూ వేని రావు ఫౌండేషన్ ఇప్పుడు జన్వాడలో మరో 2 స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను ఏర్పాటు చేయనుందన్నారు. నేటి ఆధునిక డిజిటల్ తరగతి గదులు విద్యను మరింత ఆసక్తికరంగా మారుస్తాయన్నారు. నటి మంచు లక్ష్మితో సెల్ఫీలు దిగేందుకు ఉపాధ్యాయులు, స్థానిక మహిళలు విద్యార్థులు ఆసక్తి కనబర్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అపహరించిన ఆలయంలోని హుండిలోని నగదు కేసు నమోదు చేసిన ఎస్ ఐ

చొప్పదండి,తెలంగాణ దిశ కరీంనగర్ జిల్లా గంగాధర మండలం న్యాలకొండ పల్లి గ్రామంలోని అమ్లేట్ గ్రామమైన కొండన్నపల్లి గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం మరియు శివాలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు రెండు ఆలయాల తాళాలు, హుండీలు పగులగొట్టి అందులోని సుమారు రూ. 6,000 నగదును అపహరించారు. ఈ విషయంపై ఆలయ ఇన్‌చార్జి మేడిచెల్మల రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంగాధర పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. వంశీ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రిజర్వేషన్లు లేకుండానే స్థానిక ఎన్నికలు



**హైదరాబాద్,తెలంగాణ దిశ** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని కోర్టు డెడ్ లైన్ పెట్టింది. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకు వచ్చిన రిజర్వేషన్ల బిల్లు, ఆర్డినెన్స్ ఆమోదం పొందలేదు. ఢిల్లీలో ధర్నా చేసిన సీఎం రేవంత్ ప్రధానిగా రాహుల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలకు 42 శాతం కోటా ఇస్తామని ప్రకటించారు. అంటే ఇప్పుడు.. రిజర్వేషన్లకు అవకాశం లేదని ప్రభుత్వం కూడా నిర్ణయానికి వచ్చినట్లే అనుకోవచ్చు. మరి ఇప్పుడు స్థానిక ఎన్నికల విషయంలో సీఎం రేవంత్ ఏం చేయబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్రపతి నుండి ఎలాంటి స్పందన లేనందున సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందని సీఎం రేవంత్ అంటున్నారు. మా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది కాబట్టే.. ఇక్కడి వరకు వచ్చామమని.. ప్రస్తుతం ప్రభుత్వం ముందు మూడు ఆప్షన్లు ఉన్నాయని రేవంత్ అంటున్నారు. అందులో ఒకటి కేంద్రం ఆమోదం తెలిపే వరకు వేచి చూడాలి. ఇప్పుడల్లా ఆమోదిస్తారన్న నమ్మకం లేదు. స్థానిక ఎన్నికలు నిర్వహించి తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో ఇక జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లడం. అయితే జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్తే.. అది న్యాయపరమైన వివాదాల్లో ఇరుక్కుంటుంది. దీని వల్ల స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమవుతాయి. మూడో ఆప్షన్ గా 42 శాతం బీసీలుక రిజర్వేషన్ పార్టీ పరంగా ఇచ్చి ఎన్నికలకు వెళ్ళడమని రేవంత్ అన్నారు. ప్రభుత్వం జీవో ఇచ్చి ఎన్నికలకు ఎవరైనా కోర్టుకు పోతే స్టే ఇస్తుంది. రిజర్వేషన్ గురించి అబద్ధపు హామీలు ఇచ్చి నేను ఎన్నికలకి నేను పోలేనన్నారు. సెప్టెంబర్ 30 కల్లా స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలి కోర్టు తీర్పు ఉన్న నేపథ్యంలో ఎలా ముందుకు వెళ్ళాలన్నదానిపై చర్చిస్తున్నామన్నారు. తొందరలోనే ఖంఅ సమావేశం ఏర్పాటు చేస్తాం చర్చ చేస్తామని.. గ్రామాల్లో ఎలా ఉంది పరిస్థితి అనేది అడిగి తెలుసుకుంటామంటున్నారు. ఇప్పటికే స్థానిక సంస్థలకు కేంద్రం నుండి వచ్చే నిధులు ఆగిపోయాయాని రేవంత్ అన్నారు. జంతర్ మంతర్ లో నిన్నటి దీక్ష మా నిరసన దేశవ్యాప్తంగా తెలంగాణ బిసి రిజర్వేషన్ కోసం చేస్తున్న పోరాటం తెలియాలి అనే చేశామన్నారు.



# చిచ్చుపెట్టిన మినిస్టర్ పోస్ట్?

## అన్నదమ్ముల మధ్య మాటలు బంద్..?!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మంత్రి పదవి అంశం కోమటిరెడ్డి బ్రదర్స్ మధ్య గ్యాప్ పెంచుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఒకే ఫ్యామిలీ నుంచి ఇద్దరికి మంత్రి పదవి ఇవ్వడం కష్టమని హైకమాండ్ నుంచి సంకేతాలు రావడమే అందుకు కారణమని తెలుస్తున్నది. ఇప్పటికే వెంకట్ రెడ్డి మంత్రిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు రాజగోపాల్ రెడ్డిని కేబినెట్ లోకి తీసుకోవాలంటే వెంకట్ రెడ్డిని తప్పించాల్సి ఉంటుందని, అందుకు వెంకట్ రెడ్డి ఒప్పుకోవడం కష్టమని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే ఇద్దరి మధ్య ఉన్న గ్యాప్.. మరింత పెరుగుతున్నదని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

**ఇద్దరి మధ్య మాటలు అంతంత మాత్రమే!:** ఒకప్పుడు కోమటిరెడ్డి బ్రదర్స్ అంటే.. రాజకీయాల్లో ఒకే మాట, ఒకే పార్టీ, ఒకే పాలసీ అనే విధంగా ఉండేది. ఇరువురు కలిసి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కొంత మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు ఎన్నికల్లో ఆర్థిక సాయం చేసేవారని టాక్ ఉండేది. రాజగోపాల్ రెడ్డినే ఆ బాధ్యతలను స్వయంగా పర్యవేక్షించేవారని జిల్లా నేతలు గుర్తు చేస్తుంటారు. అంతగా ఒకేతాటి మీద ఉన్న బ్రదర్స్‌ను 2022లో రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాలు కాస్త దూరం చేశాయి. 2018లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన రాజగోపాల్ రెడ్డి 2022లో తన ఎమ్మెల్యే సభ్యత్వానికి రాజీనామా చేసి, బీజేపీ తీర్థం పుచ్చుకుని, బై ఎలక్షన్ లో పోటీ చేశారు. అప్పుడు వెంకట్ రెడ్డి కాంగ్రెస్ లోనే కొనసాగారు. మునుగోడు బై ఎలక్షన్ లో తమ్ముడికి వ్యతిరేకంగా కాంగ్రెస్ అభ్యర్థి కోసం పనిచేశారు. అప్పటి నుంచే ఇరువురి మధ్య మాటలు అంతంత మాత్రంగానే ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ లో చేరిన తరువాత రాజగోపాల్ రెడ్డి తన అన్న ఎన్నికల వ్యవహారాలను కూడా పట్టించుకోలేదని, తనకు కావాల్సిన వనరులను వెంకట్ రెడ్డే స్వయంగా సమకూర్చు కున్నట్లు ప్రచారం ఉంది.

**గ్యాప్ పెంచుతున్న 'మంత్రి పదవి' అంశం:** అన్న వల్లే తనకు మంత్రి పదవి దక్కడం లేదని రాజగోపాల్ రెడ్డి భావిస్తున్నట్లున్నా.. ఇప్పటివరకైతే ఆ విధంగా ఎక్కడ కూడా మాట్లాడలేదు. అయితే ఒకే ఫ్యామిలీకి రెండు పదవులు సరికాదు అనే అభ్యంతరాలపై స్పందిస్తూ 'మాది ఉమ్మడి ఫ్యామిలీ కాదు.

ఆయనదో ఫ్యామిలీ. నాదో ఫ్యామిలీ' అని వివరణ ఇస్తున్నారు. అయితే రాజగోపాల్ రెడ్డి సన్నిహితుల్లో మాత్రం వెంకట్ రెడ్డి వల్లే తమ లీడర్ కు మంత్రి పదవి రావట్లేదని చర్చించుకుంటున్నారు. అలాగే వెంకట్ రెడ్డి సైతం తమ్ముడు చేస్తున్న హాట్ కామెంట్స్ ను తప్పుపట్టడం లేదు. అయితే ఆయన సన్నిహితులు మాత్రం 'రాజగోపాల్ వ్యవహరిస్తున్న తీరు మా లీడర్ కు ఇబ్బంది తెస్తున్నాయి' అని ఇంటర్నల్ మీటింగ్స్ లో తప్పుపడుతున్నారు.

**తగువుకు హైకమాండ్ కారణమా?:** కొన్ని రోజులుగా రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శలు సంధిస్తున్నారు. సీఎంపై పరోక్షంగా ఎటాక్ చేస్తున్నారు. అందుకు ఆయనకు మంత్రి పదవి దక్కకపోవడమే కారణమనే చర్చ పార్టీ వర్గాల్లో ఉంది. బీజేపీలో ఉన్న రాజగోపాల్ రెడ్డిని మంత్రి పదవి ఇస్తామని హామీతోనే కాంగ్రెస్ అధిష్టానం పార్టీలో చేర్చుకుంది. ఇప్పుడు ఆదే విషయాన్ని ఆయన గుర్తు చేస్తున్నారు. 'తనకు మంత్రి పదవి ఇస్తామని చెప్పి పార్టీలోకి తీసుకొచ్చారు. ఇవ్వడం, ఇవ్వకపోవడం వాళ్ల ఇష్టం' అని కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఆయనతో పాటే పార్టీలో చేరిన వివేక్ ను కేబినెట్ లోకి తీసుకుని.. తనను పక్కన పెట్టడంతో రాజగోపాల్ లో అసహనం పెరుగుతున్నదని ఆయన సన్నిహితులు అంటున్నారు. అందుకే ఆయన కొంత కాలంగా ఘాటుగా స్పందిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తే, తన పదవికి ఎసరు వస్తుందనే విషయాన్ని గ్రహించిన వెంకట్ రెడ్డి సీఎంకు క్లోజ్ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అందులో భాగంగానే కొన్ని రోజులుగా సీఎంను పొగడ్తలతో ముంచెత్తుతున్నట్లు చర్చ జరుగుతున్నది.

**'పంచాయితీ' హైకమాండే పరిష్కరించాలి:**

ఈ వివాదానికి కాంగ్రెస్ హైకమాండే ఫుల్ స్టాప్ పెట్టాల్సి ఉందని కాంగ్రెస్‌కార్యకర్తలు చెబుతున్నారు. 'మంత్రి పదవి ఇస్తామని రాజగోపాల్ రెడ్డికికాంగ్రెస్ పెద్దలే హామీ ఇచ్చారు. వెంకట్ రెడ్డిని మంత్రి వర్గంలోకి తీసుకోవాలని రేవంత్ కు అధిష్టానమే ఆదేశించిం ది. దీంతోఇద్దరికి మంత్రి పదవులు ఇస్తారా? లేక అన్నకు నచ్చజెప్పి తమ్ముడికిచాన్స్ ఇస్తారా! ప్రత్యామ్నాయ పదవి తీసుకోమని రాజగోపాల్ రెడ్డికే సూచిస్తారా?' అనే పంచాయితీని అధిష్టానం తీర్చాల్సి ఉంటుందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

# ఆ ఐదుగురిపైనే భారమంతా..!


**విజయవాడ్,తెలంగాణ దిశ :** వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా పోరాటాలకు సిద్ధమవుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్న క్రమంలో.. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధపడుతున్నారు. ప్రజల మధ్యకు వెళ్లేందుకు అన్ని రకాల సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పార్టీలో మిగతా నాయకులను క్రియాశీలకం చేస్తున్నారు.

అందులో భాగంగా యువతకు ప్రాధాన్యం ఇస్తూ కార్యవర్గాలను నియమిస్తున్నారు. కూటమి దూకుడుగా ఉన్న నేపథ్యంలో యువ నేతలకు అవకాశం ఇవ్వడం ద్వారా.. ధీటుగా ఎదుర్కొంటారని ఆలోచన చేస్తున్నారు. అందుకే యువజన విభాగాన్ని మరింత పటిష్టం చేశారు జగన్. యువజన విభాగానికి కొత్తగా ఐదుగురు యువనేతలను వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమించారు. ఈ మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది.

**కొత్తగా వర్కింగ్ ప్రెసిడెంట్లు..:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్లు గా అన్నం రెడ్డి అదీప్ రాజు, కారుమూరి సునీల్ కుమార్, పేర్ని కిట్టు, భూమన అభినయ్ రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నియామకం అయ్యారు. వారికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాలకు బాధ్యులుగా నిర్మించారు. ఆ జిల్లాల్లో పార్టీ బాధ్యతలను అధ్యక్షుడితో కలిసి పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఇప్పటికే రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జక్కంపూడి రాజా కొనసాగుతున్నారు. ఈయన మాజీ ఎమ్మెల్యే కూడా. అన్నం రెడ్డి అదీప్ రాజుకు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి బాధ్యతలు అప్పగించారు. కారుమూరి సునీల్ కుమార్ కు కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. పేర్ని కిట్టుకు కృష్ణా, ఎన్టీఆర్,గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల బాధ్యతలు ఇచ్చారు. భూమన అభినయ రెడ్డికి ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల బాధ్యతలు ఇచ్చారు. × బైరెడ్డి సిద్ధార్థ రెడ్డికి వైయస్సార్ కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల బాధ్యతలను కేటాయించారు

# విజేతల మెజారిటీల కంటే తొలగింపులే అధికం

## బీహార్‌లో 24 లోక్‌సభ స్థానాలలో ఇదే పరిస్థితి



పాట్నా : కేంద్ర ఎన్నికల సంఘం ప్రచురించిన బీహార్ ముసాయిదా ఓటర్ల జాబితాలో అనేకఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్రంలో 40 లోక్‌సభ స్థానాలు ఉండగా వాటిలో 24 స్థానాలలో తొలగించిన ఓటర్ల సంఖ్య గత లోక్‌సభ ఎన్నికలలో విజేతలు సాధించిన మెజారిటీ కంటే ఎక్కువగా ఉండడం గమనార్హం. అంటే దీనర్థం ఏమిటి? జాబితాల నుంచి తొలగించబడిన ఓటర్లు బీహార్ లోని సగానికి పైగా లోక్‌సభ స్థానాల ఫలితాలను నిర్ణయించడంలో కీలకంగా మారి ఉండవచ్చునని అర్థమవుతోంది. వివిధ సందర్భాలలో ఎన్నికల కమిషన్ విడుదల చేసిన డేటాను 'ది క్వింట్' పోర్టల్ విశ్లేషించగా ఈ విషయం బయటపడింది. ఉదాహరణకు బిజెపి నాయకుడు గిరిరాజ్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న బెగూసరారు లోక్‌సభ స్థానంలో 2024 ఎన్నికల సమయంలో 22,00,435 మంది ఓటర్లు ఉన్నారు. 'సర్' కసరత్తు తర్వాత వారి సంఖ్య 20,77,257కు తగ్గింది. అంటే 1,23,178 మంది ఓటర్లు తగ్గిపోయారు. లోక్‌సభ ఎన్నికలలో గిరిరాజ్ సింగ్‌కు వచ్చిన మెజారిటీ 81,480 ఓట్లే. ఈ విధంగా తొలగించిన ఓటర్ల సంఖ్యతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికలలో విజేతలకు వచ్చిన మెజారిటీ తక్కువగా ఉన్న స్థానాలలో వాల్మీకి నగర్, పూర్వి చంపారన్, షియోహర్, సీతామర్హి, అరారియా, కిషన్‌గంజ్, కతిహార్, పూర్నియా, వైశాలి, గోపాల్‌గంజ్, సివాన్, మహరాజ్‌గంజ్, సరన్, ఉజెయిర్‌పూర్, బెగూసరారు, భాగల్పూర్, బంకా, ముంగర్, పాటలీపుత్ర, అర్రా, బక్సర్, కారాకట్, ఔరంగాబాద్, నవాడా ఉన్నాయి. ఈ 24 స్థానాలలో 16 స్థానాలను జెడియు, బిజెపి, హెచ్‌ఎఎం, ఎల్‌జెపి గెలుచుకున్నాయి. ఐదు స్థానాలలో కాంగ్రెస్, ఆర్‌జెడి విజయం సాధించగా, రెండు చోట్ల సిపిఐ (ఎంఎల్), ఒక చోట స్వతంత్రుడు గెలుపొందారు. షియోహర్ స్థానంలో గత లోక్‌సభ ఎన్నికల తర్వాత 1,09,723 ఓట్లను తొలగించారు. అక్కడ జెడియు అభ్యర్థి కేవలం 29,143 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారు. 2019 లోక్‌సభ ఎన్నికలకు, 2020 శాసనసభ ఎన్నికలకు మధ్య ఈ నియోజకవర్గంలో 69,867 మంది ఓటర్లు కొత్తగా నమోదవడం గమనార్హం. పూర్వి చంపారన్, అరారియా, సీతామర్హి వంటి కొన్ని స్థానాలలో కూడా ఆ సమయంలో ఓటర్లు పెరిగారు. తొలగించిన ఓటర్లకు సంబంధించి ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉన్నదని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) వ్యవస్థాపకుడు జగదీప్ ఛోకర్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలపై అనుమానాలు వ్యక్తం చేయాల్సిన అవసరమేమీ లేదని ప్రధాన ఎన్నికల కమిషనర్ ఒపి రావత్ స్పష్టం చేశారు.

# షర్మిళకు చెక్!

## ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్స్




**విజయవాడ్,తెలంగాణ దిశ :** ఏపీ పై కాంగ్రెస్ హై కమాండ్ దృష్టి పెట్టిందా? రాష్ట్రంలో పార్టీని గాడిలో పెట్టే ప్రయత్నం జరుగుతోందా? షర్మిలను ముందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని చావు దెబ్బ తీయాలని భావిస్తున్నారా? వైసీపీని బలహీనపరిచి ఆ స్థానంలోకి రావాలని కాంగ్రెస్ చూస్తోందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఇకనుంచి సీనియర్ల సేవలను వినియోగించుకుని పార్టీని బలోపేతం చేయాలని వైసిపి హై కమాండ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే పార్టీకి ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లు రావడంతో పాటు ఓ పాతికమంది సీనియర్లతో జంబో కమిటీని ఏర్పాటు చేశారు. షర్మిల సేవలను విస్తృతంగా వాడుకోవడం ద్వారా.. ఆమెను ఈ నాలుగేళ్ల పాటు ప్రజల్లో ఉంచడం ద్వారా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలన్న ఆలోచనలో కాంగ్రెస్ పార్టీ ఉంది. తద్వారా ఏపీలో కాంగ్రెస్ బలం పెంచాలని భావిస్తోంది.

ఎన్నికలకు ముందు పిసిసి చీఫ్ గా బాధ్యతలు స్వీకరించారు షర్మిల. ఆమె సీనియర్లను కలుపుకొని వెళ్లడం లేదన్న విమర్శ ఉంది. అదే సమయంలో సీనియర్లు సైతం ఆమెకు సహకారం అందించడం లేదన్న ఆరోపణ కూడా ఉంది. అందుకే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఏపీ విషయంలో ఒక నిర్ణయానికి వచ్చింది. పిసిసి చీఫ్ గా షర్మిలను కొనసాగిస్తూనే.. వర్కింగ్ ప్రెసిడెంట్గా కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం, మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీలను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ఓ 25 మందితో కూడిన పొలిటికల్ అడ్వైజరీ కమిటీని కూడా నియమించి ంది కాంగ్రెస్. వారిని కలుపుకొని ముందుకెళ్లాలని పిసిసి చీఫ్ నకు ఆదేశించింది హై కమాండ్.కాంగ్రెస్ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీలో ఓ 25 మందికి చోటు దక్కింది. ఈ కమిటీకి చైర్మన్గా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మాణికం ఠాగూర్ ఉంటారు. పిసిసి అధ్యక్షురాలు షర్మిల, పిసిసి మాజీ చీఫ్ రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రులు పల్లంరాజు, చింతా మోహన్, జెడి శీలం, కిల్లి కృపారాణి వంటి వారికి చోటు కల్పించారు. వీరితో పాటు కేవీపీ రామచంద్రరావు, జిబి హర్ష కుమార్, తులసి రెడ్డి వంటి సీనియర్లు కూడా ఈ కమిటీలో ఉంటారు. షర్మిలను ముందు పెట్టి పార్టీని నడిపించే బాధ్యత వీరికి అప్పగించనున్నారు. ఇకనుంచి కాంగ్రెస్ పార్టీలో విధానపరమైన నిర్ణయాలు ఈ కమిటీ తీసుకొనుంది.షర్మిల నాయకత్వ బాధ్యతలు మారుస్తారని అంతా ప్రచారం నడిచింది. అయితే అందులో ఎంత మాత్రం నిజం లేదని తేలిపోయింది. మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది.

# భళా..భలే ఆర్ట్..!

## ఐటీడీఏ పీవో సతీమణి గీసిన చిత్రం ఇది





**భద్రాద్రి కొత్తగూడెర్,తెలంగాణ దిశ :.** ట్రైబల్ మ్యూజియం పిఓ రాహుల్ అపురూప సృష్టి. ఇది భౌతికంగా.కానీ ఈ అద్భుతమైన మ్యూజియం భవనాన్ని, ప్రాంగణాన్ని అపురూప చిత్రంగా మలిచారు పిఓ రాహుల్ సతీమణి మనీషా రాహుల్. పిఓ రాహుల్ తరహాలోనే ఏదో ఒక నూతనత్వాన్ని అందించాలనేది వారి సతీమణి తపన. అందుకే తన మనసుకు తోచిన బహుళ ప్రజాదారణ పొందుతున్న ట్రైబల్ మ్యూజియం అంశాన్ని చిత్ర రూపంలో చూపించారు. ట్రైబల్ మ్యూజియంను ఎంచక్కా తన పెయింటింగ్ రూపంలో భద్రపరిచారు. సహజ తత్వాన్ని సిద్ధించే విధంగా ఈ బొమ్మ రూపుదిద్దుకోవటం తన పెయింటింగ్ కళావైభవానికి ప్రత్యేకంగా చెప్పవచ్చు. పీవో సతీమణి మనీషా రాహుల్ వృత్తి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. కవితలు, కథలు, శీర్షికలు రాయటం, చదవటం ఆమె హాబీ. పెయింటింగ్ వేయటంలో కూడా ఆమె సిద్ధ హస్తురాలు. పండుగ రోజుల్లో మహిళలతో ఆడిపాడుతూ వారికి సంతోషాన్ని పంచుతుంటారు. చదువుకునే చిన్నారులు అంటే ఆమెకు ఎంతో మమకారం. భద్రాచలంలో ఉన్న చెవిటి,మూగ పాఠశాలలో చదివే చిన్నారులను తరచూ కలుస్తూ వారి పాఠశాలకు వెళ్లి చిన్నారులతో కాలక్షేపం చేస్తూ వారికి తినుబండారాలు, భోజన సౌకర్యం కల్పిస్తూ...వారిని ఎంతో ప్రేమగా చూసుకుంటూ ఉంటారు.భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ మాదిరిగా గిరిజన ప్రగతికి తన వంతు సహకారాన్ని అందజేస్తూ మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్న... మనిషా రాహుల్ ని మరి అభినందిద్దామా.



# గురువిందగింజ తన నలుపెరుగదు



పాలు పోసి, పెంచి పోషించినంత మాత్రాన విషసర్పం కాటేయకుండా ఉంటుందా? డబ్బులు పెట్టి, పెంచి పోషించినంత మాత్రాన యూట్యూబ్ జర్నలిజం తిరగబడకుండా ఉంటుందా? ఇప్పుడు అదే జరుగుతున్నది తెలంగాణలో. నాడు పీసీసీ అధ్యక్షునిగా ఉన్న రేవంత్‌రెడ్డి స్వయంగా విషం నింపి, పెంచి పోషించిన యూట్యూబ్ జర్నలిజం ఈ రోజు ఆయనపైనే విషం కక్కుతున్నది. తన చేతుల మీదుగా పెరిగిన యూట్యూబర్స్ తన మీదనే తిరగబడుతుంటే ఆయన తట్టుకోలేకపోతున్నారు. అసహనంతో అసెంబ్లీలో ఊగిపోతున్నారు. నాడు కన్నూ మిన్నూ కానరాక తాను చేసిన వికృత క్రీడలను మరిచి, తనదాకా వచ్చేసరికి నేడు 'అధ్యక్షా..' అంటూ ఆవేదన చెందుతుండటం హాస్యాస్పదం.

యూట్యూబ్ జర్నలిజం, సోషల్ మీడియా జర్నలిస్టుల వల్ల లాభమో, నష్టమో చర్చించేముందు అసలు దాన్ని పెంచిందెవరు? పోషించిందెవరు? అనేది తెలంగాణ సమాజం చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. తెలంగాణ ఏర్పడిన కొత్తలో మన రాష్ట్రంలో యూట్యూబ్‌లు, రేవంత్ చెప్పే ట్యూబ్‌లు అసలున్నాయా? తన రాజకీయ లబ్ధి కోసం తెలంగాణ సమాజంలో ఈ సోషల్ విషాన్ని నింపిందెవరు? కనుగోలు వంటి టీంలను కొనుగోలు చేసిందెవరు? వాక్ స్వాతంత్ర్యం పేరిట, ప్రతిపక్షం పేరిట తెలంగాణ సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై విషం కక్కిందెవరు? మార్నింగ్ న్యూస్ పేరిట మాన, మర్యాదలు మరిచి బూతు పురాణం, తిట్ల దండకంతో రెచ్చిపోయిన యూట్యూబ్ జర్నలిస్టులకు అండగా నిలిచిందెవరు? రాజ్యాంగం వారికేవో ప్రత్యేక హక్కులు కల్పించినట్టు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై నోటికి వచ్చింది వాగుతుంటే పక్కనే ఉండి సహకరించిందెవరు? బొడ్డు కోసి ఇష్టం వచ్చినట్టు పేర్లు పెడుతుంటే నవ్వులు చిందించిందెవరు? అంతవరకు ఎందుకు ప్రతిపక్ష హోదాలో ఉన్నానన్న సోయిని మరిచి మాజీ మంత్రి కేటీఆర్ తనయుడిపై మీరు బాడీ షేమింగ్ చేయలేదా? ఇప్పుడు మీదాకా వచ్చేసరికి ఆ నొప్పి తెలుస్తున్నదా? అయినా జర్నలిస్టుల పేరిట కొందరు అప్పుడు వికృతానందం పొందితే.. నేడు మీ ప్రజాపాలనలో కష్టాలు పడలేక మిమ్మల్ని ఎన్నుకున్న ప్రజలే తిడుతున్నారు. అంతే తప్ప జర్నలిస్టులు మిమ్మల్ని దూషించడం లేదు. మీ తప్పులను ఎత్తిచూపుతున్నారంతే. అంతమాత్రాన యూట్యూబ్ జర్నలిస్టుల తోడ్కలు తీస్తారా? బట్టలిప్పించి రోడ్డుపై పరిగెత్తిస్తారా? ప్రజాపాలన పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మెయిన్ స్ట్రీమ్ మీడియాను గుప్పెట్లో పెట్టుకున్నది. రేవంత్ పాద ధూళిని చూసి పరవశించిపోతున్న పచ్చ మీడియా.. వాస్తవాలను వక్రీకరిస్తున్నది. నిజాలను బయటకు రానివ్వడం లేదు.

సీఎం సొంతూరు కొండారెడ్డిపల్లెలో మాజీ సర్పంచ్ ఒకరు సీఎం సోదరుల పేర్లు రాసి ఆత్మహత్యకు పాల్పడితే.. అతిపెద్ద సర్క్యులేటెడ్ డైలీ అని చెప్పుకొనే ఓ పేపర్ ఆ వార్తను జిల్లా ఎడిషన్‌లోని రెండో పేజీలో ప్రచురించింది. అది కూడా సీఎం సోదరుల పేర్లు రాకుండా జాగ్రత్త పడి మరీ. అదే కొండారెడ్డిపల్లెలో మహిళా జర్నలిస్టులపై సీఎం సోదరుడు కొండల్‌రెడ్డి దుశ్శాసన పర్వానికి దిగితే సీఎం ఆస్థాన మీడియా ఆ వార్తను కనీసం కవర్ చేయలేదు. కొన్ని పచ్చ పత్రికలైతే వాళ్లసలు జర్నలిస్టులే కాదని ప్రచారం చేశాయి. జర్నలిస్టులు కాకపోయినంత మాత్రాన వారిపై దాడులకు దిగుతారా? కొండారెడ్డిపల్లిలో 100 శాతం రుణమాఫీ జరిగి ఉంటే వాళ్లను కాంగ్రెస్ నాయకులే సాదరంగా ఆహ్వానించి ప్రజలతోనే నిజాలు చెప్పించవచ్చు కదా? దాడులకు తెగపడటం ఎందుకు? నిజాలను పచ్చ పత్రికలు, రేవంత్ రెడ్డి ఆస్థాన మీడియా సమాధి చేస్తున్న ప్రస్తుత తరుణంలో యూట్యూబ్, సోషల్ మీడియా జర్నలిజం వాస్తవాలను ప్రజలకు కండ్లకు కట్టేలా చూపుతున్నది. ఆ వాస్తవాలను జీర్ణించుకోలేకనే సీఎం రేవంత్‌రెడ్డి నేడు యూట్యూబర్స్‌ను క్రిమినల్స్ అని కించపరుస్తున్నారు. మహిళా జర్నలిస్టుల అరెస్టు సందర్భంగా అసెంబ్లీలో జరిగిన చర్చ వేళ ఓ వైపు నీతులు చెప్తూనే మరోవైపు రేవంత్‌రెడ్డి జర్నలిస్టులను బట్టలిప్పదీసి కొడతానని చెప్పడం ఆయన అహంకార ధోరణికి నిదర్శనం.

మహిళలపై చర్చ జరుగుతున్న సోయి మరిచి రేవంత్‌రెడ్డి మాట్లాడ గా.. అతని సోదరుడు గతంలోనే తన రౌడీ మూకలతో ద్రౌపది వస్త్రాపహరణాన్ని చేసి చూపించారు. అసెంబ్లీలో ఇప్పుడు రేవంత్ రెడ్డి నీతులు చెప్తున్నారు. రెండు రోజుల ముందే కొత్తగా నియామకాలు అందుకున్న ఉద్యోగుల ఎదుట మాజీ సీఎం కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను మరిచిపోయినట్టున్నారు. అంతకుముందు స్కూల్ పిల్లల ఎదుట కూడా సుభాషితాలు పలికారు. నీతులు వల్లించే ముందు రేవంత్‌రెడ్డి తాను నీతిగా ఉండాలి. ఇతరులకు సుద్దులు చెప్పే ముందు ఆయన బుద్ధి తెచ్చుకోవాలి. ముఖ్యమంత్రి మాటలు చూస్తుంటే నాకైతే గురువింద గింజనే గుర్తుకు వస్తున్నది.

# రోజూ ఒక్క గ్లాస్ బూడిద గుమ్మడికాయ జ్యూస్‌ను తాగండి..



బూడిద గుమ్మడికాయలను సహజంగానే చాలా మంది దిష్టి తీసేందుకు లేదా దిష్టి తగలకుండా ఉండేందుకు ఇంటి ప్రధాన ద్వారం వద్ద కడుతుంటారు. బూడిద గుమ్మడికాయ అంటే చాలా మందికి దిష్టి తీయడమే ముందుగా గుర్తుకు వస్తుంది. కానీ ఆయుర్వేద ప్రకారం చూస్తే బూడిద గుమ్మడికాయ మనకు ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. బూడిద గుమ్మడికాయలతో కొందరు కూరలు చేసుకుని తింటారు. ఇంకా కొందరు తీపి పదార్థాలను కూడా తయారు చేస్తుంటారు. అయితే బూడిద గుమ్మడికాయలను తినడం ఇష్టం లేని వారు దీంతో జ్యూస్ తయారు చేసి కూడా రోజూ తాగవచ్చు. బూడిద గుమ్మడికాయ జ్యూస్‌ను రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఈ జ్యూస్ ఎన్నో వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుంది. దీన్ని రోజూ తప్పనిసరిగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..: బూడిద గుమ్మడియ జ్యూస్‌ను తాగడం వల్ల జీర్ణవ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీని వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు. బూడిద గుమ్మడికాయ జ్యూస్‌లో నీరు అధిక మొత్తంలో ఉంటుంది. అందువల్ల ఈ జ్యూస్‌ను సేవిస్తే జీర్ణాశయంలో ద్రవాల సమతుల్యత పెరుగుతుంది. పేగుల్లో మలం సులభంగా కదులుతుంది. సుఖ విరేచనం అవుతుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ జ్యూస్‌లో ఆల్కలైన్ గుణాలు ఉంటాయి. దీని వల్ల జీర్ణాశయంలో ఆమ్లాలు అధికంగా ఉత్పత్తి అవకుండా అడ్డుకోవచ్చు. దీంతో అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అల్సర్లు తగ్గిపోతాయి. ఈ జ్యూస్ జీర్ణాశయంపై చల్లని ప్రభావాన్ని చూపిస్తుంది. దీని వల్ల జీర్ణాశయం గోడలు ఆరోగ్యంగా ఉంటాయి. కడుపులో మంట నుంచి ఉపశమనం లభిస్తుంది.

బరువు నియంత్రణలో..: బూడిద గుమ్మడికాయ జ్యూస్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అందువల్ల ఈ జ్యూస్‌ను సేవిస్తుంటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో తీసుకునే ఆహారంపై నియంత్రణ ఉంటుంది. ఇది అధిక బరువు తగ్గేందుకు సహాయ పడుతుంది. ఈ జ్యూస్‌ను తాగుతుంటే శరీర మెటబాలిజం సైతం పెరుగుతుంది. దీని వల్ల క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు నియంత్రణలో ఉంటుంది.

బూడిద గుమ్మడికాయ జ్యూస్‌లో నీరు అధికంగా ఉండడం వల్ల దీన్ని తాగితే శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. దీంతో కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కిడ్నీల పనితీరు మెరుగు పడుతుంది. శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. శరీరం సహజసిద్ధంగా డిటాక్స్ అవుతుంది.

గుండె జబ్బులు, క్యాన్సర్ రావు..: బూడిద గుమ్మడికాయల్లో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి ఒత్తిడి, ఆందోళన తగ్గేందుకు దోహదపడతాయి. మైండ్ రిలాక్స్ అయ్యేలా చూస్తాయి. తరచూ ఈ జ్యూస్‌ను తాగుతుండడం వల్ల మూడ్ మంచిగా మారుతుంది. హ్యాప్పీగా ఉంటారు. ఏకాగ్రత, జ్ఞాపకశక్తి కూడా పెరుగుతాయి. బూడిద గుమ్మడికాయల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శరీర రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. దీంతో శరీరం ఇన్ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడుతుంది. అలాగే ఈ జ్యూస్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. బూడిద గుమ్మడికాయల్లో ఉండే హైడ్రేటింగ్ గుణాలు చర్మాన్ని తేమగా ఉంచుతాయి. చర్మం కాంతివంతంగా మారేలా చేస్తాయి. ఇలా బూడిద గుమ్మడికాయలతో అనేక ప్రయోజనాలను పొందవచ్చు. కనుక వీటి జ్యూస్‌ను రోజూ తాగడం మరిచిపోకండి.

# వెల్లుల్లి ఎక్కువైతే..



వెల్లుల్లితో దక్కే ఆరోగ్య ప్రయోజనాలు ఎన్నో అని తెలుసు. రోగ నిరోధక వ్యవస్థ పనితీరు మెరుగుపరుస్తుంది. అధిక రక్తపోటును తగ్గిస్తుంది. అయితే, మితం తప్పితే అమృతమైనా విషమే అన్నట్టు.. వెల్లుల్లిని కూడా మితంగానే వాడుకోవాలి. లేకుంటే ఆరోగ్యంపై దుష్ప్రభావాలు పడతాయి.

జీర్ణ సమస్యలు: వెల్లుల్లిలో ఫ్రక్టాన్స్ అనే మూలకాలు ఉంటాయి. ఇవి కొంతమందికి అరగవు. దీంతో వెల్లుల్లిని ఎక్కువగా తీసుకుంటే కడుపు ఉబ్బరం, గ్యాస్, అజీర్తి లాంటి సమస్యలు తలెత్తుతాయి.

పొట్ట సమస్యలు ఉన్నవాళ్లను ఇవి మరింత ఇబ్బందిపెడతాయి. అంతేకాకుండా పొట్టలో ఆమ్లం పైకి రావడం (యాసిడ్ రిఫ్లక్స్) వల్ల గుండెలోమంటగా అనిపిస్తుంది.

పరిష్కారం: వెల్లుల్లిని అవసరమైనంత మేరకే తినాలి. పచ్చిగా తినేకంటే ఉడికించి తీసుకోవడం మంచిది.

రక్తం పలుచన: రక్తాన్ని పలుచన చేసే లక్షణాల గని వెల్లుల్లి. అలా ఇది గుండె కవాటాల ఆరోగ్యానికి మేలుచేస్తుంది. మోతాదు మించితే మాత్రం.. రక్తస్రావానికి కారణమవుతుంది. వార్ఫారిన్, యాస్పిరిన్ లాంటి రక్తం పలుచన చేసే మందులు తీసుకునేవారికి ఇది మరింత చేటు చేస్తుంది. అలానే ఏదైనా సర్జరీకి సిద్ధమవుతున్న వారికి కూడా మంచిది కాదు.

పరిష్కారం: రక్తం పలుచన చేసే మందులు వాడుతున్నా, సర్జరీకి వెళు తున్నా వైద్యుల సలహా మేరకే వెల్లుల్లిని తినాలి.

దుర్వాసన (హెలిటోసిస్): వెల్లుల్లి వాడకంతో వచ్చే సాధారణమైన సమస్య నోటి దుర్వాసన. ఇది తిన్న తర్వాత కూడా చాలాసేపు ఉంటుంది. వెల్లుల్లిలో సల్ఫర్ మూలకాలు ఉంటాయి. జీర్ణం కాగానే ఇవి విడుదల అవుతాయి. అలా గాఢమైన వాసనకు దారితీస్తుంది. ఇది కొన్నిసార్లు ఇతరులకు అసౌకర్యంగా పరిణమిస్తుంది.

పరిష్కారం: వెల్లుల్లి తిన్న తర్వాత చక్కెర లేని చూయింగ్ గమ్ తినడం, నీళ్లు తాగడం, పార్స్లీ నమలడం చేయాలి.

ఇవి నోటి దుర్వాసనను దూరం చేస్తాయి. బ్రష్ చేసుకోవడం, మౌత్‌వాష్ వాడటం కూడా ఫలితాన్ని ఇస్తాయి.

అలర్జీలు

అతికొద్ది మంది మాత్రం వెల్లుల్లి అలర్జీ కలిగి ఉంటారు. చర్మంపై ఓ మోస్తరు దద్దుర్లు, శ్వాస తీసుకోవడం కష్టం కావడం, గొంతు వాపు లాంటివి ఈ అలర్జీల్లో ప్రధానంగా ఉంటాయి. ఉల్లిపాయలతో అలర్జీ ఉంటే గనుక వెల్లుల్లితో కూడా ఉన్నట్టే అని గుర్తుంచుకోవాలి.

పరిష్కారం: వెల్లుల్లి తిన్న వెంటనే ఏదైనా అలర్జీని గమనిస్తే తినడం ఆపేయాలి. వైద్య సహాయం తీసుకోవాలి.

చర్మం మంట, బొబ్బలు: చర్మానికి పచ్చి వెల్లుల్లిని నేరుగా అప్లయి చేస్తే మంటగా అనిపిస్తుంది. బొబ్బలెక్కుతుంది. గాఢమైన సల్ఫర్ మూలకాల వల్ల ఇలా జరుగుతుంది. ఫంగల్ ఇన్ఫెక్షన్ల చికిత్సలో వెల్లుల్లిని వాడతారు. కాకపోతే మోతాదు మించి మాత్రం వాడకూడదు. ఇలా చేస్తే బొబ్బలు, ఎర్రబడటం, మంట లాంటివి తలెత్తుతాయి.

పరిష్కారం: చర్మానికి వెల్లుల్లిని అప్లయి చేయాలనుకుంటే, దాన్ని ఏదైనా తైలంతో కలిపి చేయాలి. నేరుగా చేయకూడదు. ఒకవేళ ఇరిటేషన్ అనిపిస్తే, ఆ ప్రదేశాన్ని నీళ్లతో కడిగేసుకోవాలి. డాక్టర్‌ను సంప్రదించాలి.



# నలుపు రంగు క్యారెట్లను తింటే ఇన్ని లాభాలు ఉన్నాయా..? అసలు వీటిని దూరం పెట్టకండి..!

క్యారెట్లు.. ఈ పేరు చెప్పగానే సహజంగానే చాలా మందికి నారింజ రంగులో ఉండే క్యారెట్లే గుర్తుకు వస్తాయి. కానీ క్యారెట్లలోనూ అనేక వెరైటీలు ఉంటాయి. ముఖ్యంగా మనకు నలుపు రంగులో ఉండే క్యారెట్లు కూడా లభిస్తున్నాయి.

ఈ క్యారెట్లలోనూ పోషకాలు అధికంగానే ఉంటాయి. వీటి రంగు కారణంగా ఈ క్యారెట్లను తినేందుకు చాలా మంది అంతగా ఇష్టపడరు. కానీ పోషక విలువలు మాత్రం సాధారణ క్యారెట్ కన్నా నల్ల రంగు క్యారెట్లోనే అధికంగా ఉంటాయి. నలుపు రంగు క్యారెట్లను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నలుపు రంగు క్యారెట్లలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగు పరుస్తుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలను రాకుండా అడ్డుకుంటుంది.

రోగ నిరోధక శక్తికి..: నలుపు రంగు క్యారెట్లలో ఉండే విటమిన్ ఎ రోగ నిరోధక శక్తిని సైతం పెంచుతుంది. చర్మాన్ని, శిరోజాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. చర్మ సమస్యలు లేదా జుట్టు సమస్యలు ఉన్నవారు నలుపు రంగు క్యారెట్లను తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఈ క్యారెట్లలో విటమిన్ కె సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతుంది. అలాగే గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డకట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం సమస్య నుంచి బయట పడవచ్చు.

నలుపు రంగు క్యారెట్లలో పొటాషియం ఎక్కువగానే ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

మలబద్ధకం సమస్యకు..: నలుపు రంగు క్యారెట్లలో ఉండే ఫైబర్ సుఖ విరేచనం అయ్యేలా చేస్తుంది. దీంతో మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. ఈ క్యారెట్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిల్లో ఉండే ఆంథో సయనిన్స్ గుండె జబ్బులు, స్ట్రోక్స్ రాకుండా రక్షిస్తాయి. ఈ క్యారెట్లలో ఉండే బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగు పరుస్తుంది. ఈ క్యారెట్లను తినడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె జబ్బులు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి. ఈ క్యారెట్లలో ఉండే ఫైబర్ షుగర్ ఉన్నవారికి ఎంతో మేలు చేస్తుంది. డయాబెటిస్ ఉన్నవారు నలుపు రంగు క్యారెట్లను తింటుంటే షుగర్ లెవల్స్‌ను అదుపులో ఉంచుకోవచ్చు.

మెదడు పనితీరుకు..: ఈ క్యారెట్లను తింటే రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది. దగ్గు, జలుబు వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుంది. మెదడు ఆరోగ్యానికి నలుపు రంగు క్యారెట్లు ఎంతో మేలు చేస్తాయి. వీటిన తింటే మెదడు యాక్టివ్ గా పనిచేస్తుంది. చురుగ్గా ఉంటారు. బద్ధకం పోతుంది. నలుపు రంగు క్యారెట్ల ద్వారా ప్రయోజనాలు పొందాలంటే వీటిని నేరుగా పచ్చిగానే తినాల్సి ఉంటుంది. దీంతో పోషకాలు కూడా అధికంగా లభిస్తాయి. ఈ క్యారెట్లతోనూ కూరలు చేసుకోవచ్చు. ఇలా నలుపు రంగు క్యారెట్ల వల్ల ఎన్నో లాభాలను పొందవచ్చు.

# పిల్లలకు సమస్యాత్మకం అడినాయిడైటిస్..



ముక్కు వెనక, గొంతు పైభాగంలో ఉండే అడినాయిడ్స్ కణజాలంలో వాపు రావడాన్ని అడినాయిడైటిస్ అంటారు. పిల్లల్లో ఇది చాలా సాధారణం. ఇది గురక, నోటినుంచి శ్వాస, మాటిమాటికి చెవి ఇన్ఫెక్షన్లు, వినికిడి తగ్గడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, పెదవులు పగలడం, ముక్కుకారడం, నోటినుంచి దుర్వాసన లాంటి సమస్యలకు దారితీస్తుంది. ఇన్ఫెక్షన్, అలర్జీ, పొట్టలో ఆమ్లం పైకి తన్నుకు రావడం వల్ల వచ్చే మంట మొదలైన వాటివల్ల అడినాయిడ్ కణజాలంలో ఇన్‌ఫ్లమేషన్‌తో అడినాయిడైటిస్ వస్తుంది. ఇది పిల్లలకు రెండేండ్ల వయసు ఉన్నప్పుడు ఏర్పడి 8 ఏండ్లు వచ్చేసరికి పరిమాణం తగ్గిపోతుంది. అయితే, అడినాయిడ్స్ ఎక్కువ కాలంపాటు వాచిపోయి ఉంటే మాత్రం సమస్యాత్మకం అవుతాయి. ముప్పు ఎవరికి?: సీసాపాలు తాగే పిల్లలు. పడుకున్న భంగిమలో తల్లిపాలు తాగేవారు. ముక్కు లేదా గొంతు దగ్గర ఇన్ఫెక్షన్ ఉన్నవాళ్లు. ఏదైనా అలర్జీతో బాధపడే పిల్లలు. సైడ్ ఎఫెక్ట్స్ ఏంటి? ముక్కుకారడం. మాటిమాటికి చెవి ఇన్ఫెక్షన్లు. వినికిడి శక్తి తగ్గుతుంది. నోరు ఎండిపోతుంది. పండ్ల నిర్మాణం దెబ్బతింటుంది. ముక్కుతో మాట్లాడినట్టు ఉంటుంది. సన్నని ముక్కు, పైపెదవి చిన్నగా ఉండటం, అంగిలి ఇరుకుగా ఉండటం, ఇరుకుగా–పొడవుగా ఉండే అంగిలి, దంతాలు గజిబిజిగా ఉండే అడినాయిడ్ ఫేసీస్ సమస్య. చికిత్స ఎలా?: అడినాయిడ్స్‌ను నిర్ధారణ చేయడానికి డాక్టర్లు పిల్లల ముక్కు, చెవులు, నోరు, గొంతు పరీక్షిస్తారు. లక్షణాలు తీవ్రంగా ఉంటే మాత్రం అడినాయిడ్స్ వాపు, శ్వాసనాళంలో ఆటంకాలను పరిశీలించడానికి ఎక్స్ రే పరీక్ష కూడా సూచించే అవకాశం ఉంది. చాలావరకు పిల్లలకు 8 ఏండ్లు వచ్చేసరికి అడినాయిడ్స్ వాటంతట అవే తగ్గిపోతాయి. పరిశుభ్రంగా ఉంటూ, ఇన్ఫెక్షన్లు రాకుండా చూసుకుంటేనే ఇది సాధ్యమవుతుంది. సమస్య లక్షణాలు మితంగా ఉంటే మామూలు చికిత్స సరిపోతుంది. ఒకవేళ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ఉంటే గనుక డాక్టర్లు యాంటిబయోటిక్స్ ఇస్తారు. అడినాయిడ్స్ పరిమాణం తగ్గడానికి ముక్కు స్ప్రేలు ఉపయోగించాల్సి ఉంటుంది. అయినా సమస్య తగ్గకపోతే వైద్యులు అడినాయిడెక్టమీ అనే సర్జరీ సిఫారసు చేస్తారు.

# సినిమా..

## రష్మిక మరో బిగ్ స్టెప్..



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న కెరీర్ లో ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకుపోతుందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. వరుస సినిమాల్లో నటిస్తున్న అమ్మడు.. అదే సమయంలో హిట్స్ కూడా అలాగే అందుకుంటోంది. బ్లాక్ బస్టర్ సినిమాలతో అందరినీ మెప్పిస్తున్న రష్మిక.. మరిన్ని సినిమాల్లో ఛాన్స్ లు సొంతం చేసుకుని సత్తా చాటుతోంది. మొత్తానికి మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా బిజీగా ఉన్న ఆమె.. షూటింగ్స్ తో తీరిక లేకుండా గడుపుతుందనే చెప్పాలి. ఇప్పుడు సౌత్ టు నార్త్.. అనేక ఆఫర్స్ ఆమె చేతిలోనే ఉన్నాయి. అలా తక్కువ టైమ్ లో ఎక్కువ డబ్బులు సంపాదిస్తున్నట్లే ఉంది. అదే సమయంలో ఇప్పుడు రష్మిక మందన్న వ్యాపార రంగంలోకి అడుగుపెట్టింది. ఆ విషయాన్ని ఆమెనే చెబుతూ పోస్ట్ చేసిన వీడియోస్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. తొలుత ఓ వీడియో షేర్ చేస్తూ.. “నేను చివరకు దీన్ని రికార్డ్ చేస్తున్నానని నేను నమ్మలేకపోతున్నాను. మీకు ఇప్పటికే తెలిసినట్లుగా, నేను నా హృదయానికి చాలా దగ్గరగా ఉన్న దానిపై పని చేస్తున్నాను” అంటూ చెప్పుకొచ్చింది. “మీరు దానిని అనుభవిస్తారని నేను ఆశిస్తున్నాను, మీరు దానినిఇష్టపడతారని నేను ఆశిస్తున్నాను. దానినిమీతో పంచుకోవడానికి వేచి ఉండలేను. చాలా చాలా చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఆందోళనగా ఉన్నాను. కృతజ్ఞతతో ఉన్నాను” అని చెప్పిన రష్మిక.. ఆ తర్వాత తన తల్లితో జరిగిన సంభాషణ వీడియోను పోస్ట్ చేసింది. అందులో రష్మిక “నేను ఇప్పుడు చాలాముఖ్యమైన షూట్‌కువెళ్తున్నాను. మీరు చెప్పిన వ్యాపారాన్ని నేను ప్రారంభిస్తాను” అని తల్లితో చెప్పగా.. ఆమె బెస్ట్ విషెస్ చెబుతారు. అయితే రష్మిక ఏ బిజినెస్ స్టార్ట్ చేయనుందో వెల్లడించలేదు. ప్రస్తుతం ఆమెకు సోషల్ మీడియాలో బెస్ట్ విషెస్ వెల్లువెత్తుతున్నాయి. బిజినెస్ లో కూడా సక్సెస్ అవ్వాలని అంతా కోరుకుంటున్నారు. కాగా, ఇప్పటికే అనేక మంది స్టార్ హీరోయిన్స్..సొంత ఫ్యాషన్ బ్రాండ్‌ను స్టార్ట్ చేసిన విషయం తెలిసిందే. తమ బిజినెస్ తో రాణిస్తున్నారు. ఇప్పుడు రష్మిక కూడా వారి బాటలోనే వెళ్తున్నారని తెలుస్తోంది. ఆ విషయాన్నే అనౌన్స్ చేయనున్నారని సమాచారం. మరి చూడాలి రష్మిక ఏ బిజినెస్ స్టార్ చేస్తారో..

## రాంచరణ్ నయా ప్లాన్ అదిరిందంతే..



టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో పెద్ది సినిమా చేస్తున్నాడని తెలిసిందే. పాన్ ఇండియా రూరల్ స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ మూవీలో జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. కాగా పెద్ది సెట్స్‌పై ఉండగానే రాంచరణ్ నయా ప్లాన్‌కు సంబంధించిన న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. ఇంతకీ విషయమేంటంటే రాంచరణ్ ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా ప్లాన్ చేసుకున్నాడట. ఇందులో భాగంగానే కేజీఎఫ్, సలార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో సినిమా చేసే అవకాశాలున్నాయని వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ లాంచ్ కంటే ముందు రాంచరణ్ చేతిలో చాలా సమయం ఉండనుండగా.. ఈ టైంలో పలువురు పాపులర్ డైరెక్టర్లతో కథా చర్చలు జరుపాలని నిర్ణయించుకున్నాడని ఫిలింనగర్ సర్కిల్‌లో న్యూస్ ఒకటి టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారింది. అన్నీ అనుకున్నట్టు కుదిరితే రాంచరణ్ మరికొన్ని రోజుల్లో తన కొత్త ప్రాజెక్ట్‌పై ప్రకటన కూడా చేయబోతున్నాడని జోరుగా టాక్ నడుస్తోంది. రాంచరణ్ నటిస్తోన్న పెద్ది మార్చి 27న 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మూవీ విడుదలకు ముందే కొత్త సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు పూర్తి చేయాలనుకుంటున్నాడట రాంచరణ్. మరి ఇదే నిజమైతే రాంచరణ్ పెద్ది సినిమా అప్‌డేట్స్‌తోపాటు రానున్న రోజుల్లో కొత్త సినిమాలకు సంబంధించిన విషయాలను కూడా షేర్ చేసుకోబోతున్నాడన్నమాట. ఇక రాంచరణ్ అభిమానులకు పండగేనన్నమాట. రాంచరణ్ రంగస్థలం తర్వాత సుకుమార్‌తో మరో సినిమాకు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే.

## పవన్ సినిమాలో రాశీ ఖన్నా..



టాలీవుడ్‌లో దశాబ్దకాలంగా తనదైన ముద్ర వేసుకున్న కథానాయిక రాశీ ఖన్నాకు ఎట్టకేలకు పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సరసన నటించే అవకాశం దక్కించుకుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమాలో ఇప్పటికే శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా.. మరో కథానాయికగా రాశీ ఖన్నా ఎంపికైనట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమాలో శ్లోక అనే పాత్రలో కనిపించబోతుంది రాశీ. ఈ సందర్భంగా రాశీ ఫొటోను చిత్రయూనిట్ పంచుకుంది. మరోవైపు ఇప్పటికే రాశీ షూటింగ్ సెట్‌లో అడుగు పెట్టి, పవన్ కళ్యాణ్‌తో కలిసి కీలక సన్నివేశాల్లో పాల్గొంటున్నారని సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ‘గబ్బర్ సింగ్’ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత పవన్ కళ్యాణ్-హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ‘ఉస్తాద్ భగత్ సింగ్’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## యాక్టింగ్‌లో ఆ ఇద్దరు మాస్టర్స్..!



షరతులచిట్టా విప్పి సందీప్‌రెడ్డి వంగా ఆగ్రహానికి గురై ‘స్పిరిట్’ అవకా శాన్ని చేజార్చుకున్న బాలీవుడ్ భామ దీపికా పదుకొనే.. రీసెంట్‌గా అల్లుఅర్జున్, అట్లీ సినిమాకు సైన్‌చేసింది. దాంతో ఒకచోట పోగొట్టుకున్న అవకాశం మరోచోట దక్కినట్టయ్యింది ఈ అందాలభామకు. ‘కల్కి 2898ఏడీ’లో ప్రభాస్..అట్లీ సినిమాతో బన్నీ.. ప్రస్తుతానికి టాలీవుడ్‌కి చెందిన ఇద్దరు అగ్రహీరోలు కవర్ అయిపోయారు. అయితే.. దీపికా తీరు చూస్తుంటే వీరిద్దరితో ఆగేలా లేదు. టాలీవుడ్ అంతా కవర్ చేసేందుకు ప్రణాళికలే రచిస్తున్నట్టుంది ఈ బెంగళూరు భామ. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో ‘నేనుటాలీవుడ్‌లో మహేష్, తారక్‌ల అభిమానిని. వారిద్దరూ నటనలో మాస్టర్స్. వారితో కలిసి నటించాలనుంది.’అంటూ పేర్కొన్నది. దీపికానోటి వెంట మహేష్, తారక్‌ల ప్రస్తావన రావడం ప్రస్తుతం బాలీవుడ్‌లో చర్చనీయాంశమైం ది. గతంలో టాలీవుడ్‌లో మీకెవరు తెలుసు? అనడిగితే ‘మహేష్’ అని అదోలా నవ్వుతూ.. మిగతా హీరోలెవరూ తెలీనట్టు ప్రవర్తించిన దీపిక.. ఇప్పుడు టాలీవుడ్ హీరోలకు భజన చేయడం చూసి.. ‘మార్పు మంచిదే’ అంటూ వెటకారంగా కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు.


## కొత్తగా తల్లి అయిన వారికి తక్కువ పని గంటలుండాలి : విద్యాబాలన్



సినీ పరిశ్రమలో పని గంటలపై జరుగుతున్న చర్చ ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ నటి విద్యాబాలన్ ఈ అంశంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యంగా.. ఇటీవల నటి దీపికా పదుకొనే, దర్శకుడు సందీప్ రెడ్డి వంగాల మధ్య ‘స్పిరిట్’ సినిమా విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో, విద్యాబాలన్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తాజాగా ‘ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా’కు ఇచ్చిన ఇంటర్వ్యూలో విద్యాబాలన్ మాట్లాడుతూ.. పరిశ్రమలో కొత్తగా తల్లి అయిన హీరోయిన్‌లకు లేదా ఇతర రంగాలలో చేసే ఆడవారికి సౌకర్యవంతమైన, తక్కువ పని గంటలు ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది. దీనివలన తల్లి బిడ్డతో గడపడంతో పాటు తనను తాను మేనేజ్ చేసుకుంటుందని విద్యా చెప్పుకొచ్చింది. అలాగే ఇటీవల పరిశ్రమలో తక్కువ పనిగంటలు.

అనుకూలమైన వర్కింగ్ అవర్స్ కావాలని కోరుతున్నారు. ఇది కూడా సరైనదే అని అనుకుంటున్నాను. అయితే నా విషయంలో నేను చేసే సినిమాలకు, ఎనిమిది గంటలు మాత్రమే షూట్ చేయలేము. నేను ఇప్పుడు తల్లిని కాదు కాబట్టి, నాకు 12 గంటల షిఫ్ట్ చేయడానికి అభ్యంతరం లేదు. ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడ షూటింగ్ చేసిన నేను జాయిన్ అవుతానంటూ విద్యా ఇంటర్వ్యూలో తెలిపింది.

## రష్మీ ఎందుకు ఇంత కఠిన నిర్ణయం తీసుకుంది



జబర్దస్త్ హాట్ యాంకర్ రష్మీ గౌతమ్ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందం, అభినయం ఉన్న ఈ భామ.. హీరోయిన్ మెటీరియల్ అయినా కూడా ఛాన్స్ లు మాత్రం దక్కడం లేదు. అయినా కూడా అడపాదడపా హీరోయిన్ గా కనిపిస్తూనే ఉంది. జబర్దస్త్ నుంచి వెండితెరకు వచ్చిన అనసూయ.. ప్రస్తుతం ఎంత బిజీగా మారిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ, రష్మీ మాత్రం జబర్దస్త్ ను వదలకుండా యాంకర్ గా కొనసాగుతూనే సినిమాల్లో కూడా బిజీగా మారింది. ఇక నిత్యం రష్మీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూనే ఉంటుంది. ముఖ్యంగా జంతు ప్రేమికురాలు అయినా రష్మీ.. వాటికి ఏదైనా అయితే మాత్రం అస్సలు తట్టుకోలేదు. వాటిని సంరక్షించాలని కోరుతూ ఉంటుంది. మూగ జీవాలు అంటే ఆమెకు ప్రాణం. అయితే ఈమధ్యనే రష్మీకి సర్జరీ జరిగిన విషయం తెల్సిందే. దానివలన ఆమె కొన్నిరోజులు వృత్తికి దూరమయ్యినట్లు కూడా తెలిపింది. అయితే తాజాగా రష్మీ మరో కఠిన నిర్ణయాన్ని తీసుకుంది.

వృత్తితో పాటు సోషల్ మీడియాకు కూడా ఆమె ఒక నెలరోజులు దూరంగా ఉండనున్నట్లు తెలిపింది. ‘హలో అందరికీ నెల రోజుల పాటు అవసరమైన డిజిటల్ డిటాక్స్ తీసుకుంటున్నాను. వ్యక్తిగతంగా, వృత్తిపరంగా కొన్ని అవరోధాలను ఎదుర్కొంటున్నాను. నేను మీ అందరికీ మాట ఇస్తున్నాను. కచ్చితంగా నేను ధృడంగా తిరిగివస్తాను.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215